

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 05-10-2026 | సంపుటి: 3 | సంచిక: 241 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 05-10-2026 | V0LUME : 3 | ISSUE : 241 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


## కేబీఆర్ పార్కు చుట్టూ రూ.1,090 కోట్ల పనులకు బ్రేక్

- 7 జంక్షన్లలో స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టు రద్దు
- వన్‌వే విధానంతో ట్రాఫిక్ సమస్య తగ్గడంతో ప్రభుత్వ పునరాలోచన
- కేఎన్‌ఆర్, మేఘా సంస్థలతో కుదిరిన ఒప్పందాల రద్దుకు ఆమోదం
- పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు 4 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన
- కొత్త కారిడార్ నిర్మాణ బాధ్యత మేఘా సంస్థకు అప్పగించే నిర్ణయం

2






## 'పట్టభద్రుల' పోరుకు
# పార్టీల కసరత్తు

- ముందంజలో కాంగ్రెస్ పార్టీ

- రెండు స్థానాలకు ఇప్పటికే అభ్యర్థుల ప్రకటన
- ఓటర్ల నమోదుపై రేవంత్, మహేశ్ కుమార్ గౌడ్ దృష్టి
- బీఆర్ఎస్, బీజేపీలో అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు
- విద్యావంతులు, నిరుద్యోగుల అంశాలే ప్రధాన ప్రచారాస్త్రాలు
- స్వతంత్రులు, విద్యావేత్తల ప్రవేశంతో మరింత ఆసక్తికరం

**హైదరాబాద్, అక్టోబరు 4:**
తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానాలకు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రారంభం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల కసరత్తును ముమ్మరం చేశాయి. అధికార కాంగ్రెస్ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో ముందంజలో నిలిచింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి టీపీసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ ఖరారు చేసింది.

**ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ దృష్టి**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

మిగతా 2వ పేజీలో..

## ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వంతు

- నవంబర్‌లో ఖాళీ కానున్న మూడు స్థానాల భర్తీకి కాంగ్రెస్ వ్యూహం
- పద్మశాలి కోటాలో కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి అవకాశం?
- ఎస్సీ, బ్రాహ్మణ వర్గాలకు చెరో స్థానం కేటాయించే యోచన
- ఆశావహుల జాబితాలో కైలాస్ నేత, అనిల్, సాంబయ్య, వెంకటేష్
- హర్కర వేణుగోపాల్‌తో పాటు అయోధ్యరెడ్డి, కుమారావు పేర్లపై పరిశీలన

2



## వరంగల్ ఎమ్మెల్సీపై బీజేపీ–జనసేన దోస్తీ?

- నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల స్థానంపై ఇరు పార్టీల దృష్టి
- జనసేన అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రకటన
- జనసేనతో మాట్లాడతామన్న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు
- పొత్తుపై తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని స్పష్టీకరణ
- అభ్యర్థిని ప్రకటించినా తప్పేమీ లేదంటున్న బీజేపీ

2

## జొమాటో డెలివరీ బాయ్‌పై దంపతుల దాడి

- మ్యాప్‌లో లొకేషన్ తప్పుగా చూపించడంతో ఆహారం ఆలస్యం
- సీసీ కెమెరాలో రికార్డయిన దాడి దృశ్యాలు
- కార్ఖానా పోలీస్ స్టేషన్ వద్ద డెలివరీ బాయ్స్ నిరసన
- సెటిల్మెంట్ కోసం డబ్బులు ఆఫర్ చేసి బెదిరిస్తున్నారని బాధితుడి ఆరోపణ

2






## ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలి

- యువత పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపు
- విజయానికి ఓర్పు, దీక్ష, నిరంతర శ్రమే పునాది
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు రావాలి
- విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, జీవిత నైపుణ్యాలు అవసరం
- మంచి గురువులే మంచి పౌరులను తీర్చిదిద్దుతారని వ్యాఖ్య

3

## శంషాబాద్‌లో ఇండిగో విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం




- పూణే–హైదరాబాద్ విమానాన్ని ఢీకొట్టిన పక్షి
- ల్యాండింగ్ సమయంలో అప్రమత్తమైన పైలట్
- విమానం ముందు భాగంలో సొట్ట గుర్తించిన నిపుణులు
- ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమాన సర్వీసుల ఏర్పాటు

2

## రాష్ట్రంలో పిడుగులతో వర్షాలు..

- ఉత్తర, తూర్పు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పలు జిల్లాలకు వర్ష సూచన
- గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం
- రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారుల సూచన
- మిగిలిన జిల్లాల్లో పొడి వాతావరణం.. అక్కడక్కడా చిరుజల్లులు

2






## కరువుపై ప్రభుత్వం విఫలం..

- రేవంత్‌పై కవిత ఫైర్
- అభావ వర్షాలతో రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు
- నవంబర్ వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్
- వెంటనే కరువు మండలాలను ప్రకటించి కేంద్ర సాయం కోరాలని సూచన
- రాబోయే రోజుల్లో తాగునీటి కొరత ముప్పు ఉందని హెచ్చరిక
- ఈవీఎంలు రద్దు చేసి పేపర్ బ్యాలెట్ విధానం తీసుకురావాలని డిమాండ్

3

## ఇండియా కూటమిలోకి టీవీకే

- తమిళనాడులో ఇండియా కూటమితో చేతులు కలిపిన విజయ్ పార్టీ
- చేరిక చారిత్రాత్మక పరిణామమన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్కం ఠాగూర్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు జిల్లాల వారీగా నిరసనలకు నిర్ణయం

4



## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక పురోగతి

- షియర్ జోన్‌ను విజయవంతంగా దాటిన ఇంజినీరింగ్ బృందాలు
- 43.968 కి.మీ. ప్రధాన టన్నెల్‌లో 79 శాతం పనులు పూర్తి
- రోజుకు 7–7.5 మీటర్ల మేర కొనసాగుతున్న తవ్వకాలు

3




## జైలు సూపరింటెండెంట్‌పై ఆరోపణలు నిరాధారం

- ఖైదీల బెయిల్‌లో జైలు అధికారులకు ఎలాంటి అధికారం లేదని స్పష్టీకరణ
- కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం మాత్రమే జైలు అధికారుల బాధ్యత
- ఆరోపణలకు ఆధారాలుంటే అధికారులకు అందించాలని సూచన
- జైళ్లలో అక్రమాలకు పాల్పడితే ఖైదీలు, సిబ్బందిపై కఠిన చర్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 4:**
రౌడీషీటర్‌కు లంచం తీసుకుని బెయిల్ ఇప్పించారనే ఆరోపణలను తెలంగాణ జైళ్ల శాఖ తీవ్రంగా ఖండించింది. న్యాయవాది హత్య కేసులో నిందితుడైన ఓ రౌడీషీటర్‌కు జైలు సూపరింటెండెంట్ డబ్బులు తీసుకుని బెయిల్ ఇప్పించడంతో పాటు, జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత దాడులకు ప్రణాళికలు రూపొందించడంలో సహకరిస్తున్నారంటూ వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని స్పష్టం చేసింది. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రస్తావించిన అంశాల నేపథ్యంలో హైదరాబాద్ రేంజ్ జైళ్ల

మిగతా 2వ పేజీలో..



# కేబీఆర్ పార్కు చుట్టూ రూ.1,090 కోట్ల పనులకు బ్రేక్

హైదరాబాద్, అక్టోబరు 4:

కేబీఆర్ పార్కు చుట్టూ రద్దీని తగ్గించేందుకు చేపట్టిన రూ.1,090 కోట్ల భారీ నిర్మాణ ప్రాజెక్టుకు ప్రభుత్వం బ్రేక్ వేసింది. ఏడు ప్రధాన జంక్షన్లలో రెండు ప్యాకేజీలుగా నిర్మించ తలపెట్టిన స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల పనులను రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్మాణ పనుల నేపథ్యంలో నెల రోజులుగా అమలు చేస్తున్న వన్‌వే విధానంతో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గినట్లు గుర్తించిన ప్రభుత్వం.. భారీ వ్యయంతో చేపట్టే ప్రాజెక్టు అవసరంపై పునరాలోచన చేసింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదించిన ప్రాజెక్టు రద్దు తీర్మానానికి స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది.

బల్దియా ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రత్యేక అధికారి, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అధ్యక్షతన, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ సమక్షంలో జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు మెయిన్ గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ పరిసరాలతో పాటు ఇతర జంక్షన్లు, చౌరస్తాల్లో చేపట్టిన పనులను నిలిపివేయనున్నారు. ప్రాజెక్టు కాంట్రాక్టులు పొందిన కేఎన్‌ఆర్, మేఘా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయడానికి కూడా కమిటీ ఆమోదం తెలిపింది.

**పంజాగుట్ట–జూబ్లీ చెక్‌పోస్టు మధ్య కొత్త కారిడార్**

కేబీఆర్ పార్కు చుట్టూ చేపట్టిన ప్రాజెక్టుకు బదులుగా పంజాగుట్ట నుంచి ఐటీ కారిడార్ వైపు సిగ్నల్ రహిత ప్రయాణానికి వీలుగా కొత్త ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ రోడ్డు, అంటే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36 వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదనకు స్థాయీ సంఘం మొగ్గు చూపింది. ప్రాథమిక ప్రతిపాదన ప్రకారం బంజారా హిల్స్ రోడ్డు నంబర్ 3లోని ముఫకంజా కాలేజీ వద్ద కారిడార్‌పైకి ఎక్కే వాహనాలు నేరుగా జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వరకు చేరుకునేలా రూపకల్పన చేయనున్నారు. ఐటీ కారిడార్ నుంచి వచ్చే వాహనాలు జూబ్లీ చెక్‌పోస్టు వద్ద కారిడార్‌పైకి ఎక్కి ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ముఫకంజా కాలేజీ వద్ద దిగేలా మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు.

**జలగం వెంగళరావు పార్కు వరకు ర్యాంప్**

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు వెళ్లే వాహనాల కోసం ఎలివేటెడ్ కారిడార్ నుంచి జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంప్ నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ఇందుకు సంబంధించిన ఇంజినీరింగ్ డిజైన్లను సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు. డిజైన్లు పూర్తయిన తర్వాత ప్రాజెక్టు అంచనా వ్యయం, నిర్మాణ విధానం, ఇతర సాంకేతిక అంశాలపై స్పష్టత రానుంది. ఇదిలా ఉండగా, కేబీఆర్ పార్కు చుట్టూ చేపట్టిన స్టీల్ బ్రిడ్జీల ప్రాజెక్టు రద్దవుతున్న నేపథ్యంలో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ బాధ్యతను మేఘా సంస్థకు అప్పగించే దిశగా జీహెచ్‌ఎంసీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# 'పట్టభద్రుల' పోరుకు పార్టీల కసరత్తు

మొదటిపేజీ తరువాయి

స్వయంగా ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్, రాజీవ్ యువ వికాసం వంటి కార్యక్రమాలను పట్టభద్రుల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది. సామ రామ్మోహన్ రెడ్డి పార్టీ తరపున చురుకుగా వ్యవహరించడం, సర్వోత్తమ్ రెడ్డికి విద్యావేత్తలు, ఉద్యోగ సంఘాల్లో ఉన్న పరిచయాలు తమకు అనుకూలంగా మారుతాయని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**అభ్యర్థుల వేటలో బీఆర్ఎస్**

బీఆర్ఎస్ కూడా ఈ రెండు స్థానాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించింది. సీనియర్ నాయకులు, మాజీ విద్యార్థి నాయకులు, విద్యావేత్తల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి దేవీప్రసాద్, దాసోజు శ్రవణ్ సహా పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానంలో కొత్త సామాజిక సమీకరణాలకు అనుగుణంగా బలమైన అభ్యర్థిని బరిలోకి దించే యోచనలో పార్టీ ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ హామీల అమలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగాల భర్తీలో జాప్యాన్ని ప్రధాన ప్రచార అంశాలుగా మార్చేందుకు బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**బీజేపీలోనూ అభ్యర్థుల ఎంపిక**

పట్టభద్రుల నియోజకవర్గాల్లో గతంలో తన ఉనికిని చాటుకున్న బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. యువ నాయకులు, విశ్వవిద్యాలయాల మాజీ విద్యార్థి నాయకుల్లో పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, గతంలో పార్టీ అభ్యర్థుల విజయాలు తదితర అంశాలను ప్రచారంలోకి తీసుకెళ్లేలా వ్యూహం రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

**పార్టీలకు ప్రతిష్ఠాత్మక పోరు**

రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు ప్రధాన పార్టీలకు కీలకంగా మారనున్నాయి. పార్టీ అభ్యర్థులతో పాటు స్వతంత్రులు, విద్యావేత్తలు, నిరుద్యోగ సంఘాల నాయకులు కూడా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పోటీ బహుముఖంగా మారే అవకాశం ఉంది. ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తయ్యేలోగా బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థుల ప్రకటన, ప్రచార వ్యూహాలు, ఓటర్ల సమీకరణపై అన్ని పార్టీల దృష్టి కేంద్రీకృతమైంది.

# వరంగల్ ఎమ్మెల్సీపై బీజేపీ–జనసేన దోస్తీ?

- నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల స్థానంపై ఇరు పార్టీల దృష్టి
- జనసేన అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రకటన
- జనసేనతో మాట్లాడతామన్న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు
- పొత్తుపై తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని స్పష్టీకరణ
- అభ్యర్థిని ప్రకటించినా తప్పేమీ లేదంటున్న బీజేపీ

హైదరాబాద్, అక్టోబర్ 4:

తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ పార్టీల్లో వేడి పెంచుతున్నాయి. హైదరాబాద్-మహబూబ్‌నగర్-రంగారెడ్డి, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానాల్లో పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారాన్ని ముమ్మరం చేయగా.. బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి.

ఈ ఎన్నికలను వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయంగా కీలకమైన పోరుగా పార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేన మధ్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమన్వయం ఎలా ఉండబోతోందన్న చర్చ మొదలైంది.

**జనసేనతో చర్చిస్తాం**

నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి జనసేన అభ్యర్థిగా తెలంగాణ వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావును ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీంతో ఈ స్థానంలో బీజేపీ వైఖరి ఏంటన్నది ఆసక్తికరంగా మారింది.

తాజాగా ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు దీనిపై స్పందించారు. జనసేన తమ భాగస్వామ్య పార్టీ అని, ఆ పార్టీతో మాట్లాడి సమన్వయం, సహకారంతో ముందుకు సాగుతామని చెప్పారు. ఇరు పార్టీల మధ్య చర్చలపై తమ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

వరంగల్ స్థానంలో గతంలో బీజేపీ గెలిచిన చరిత్ర ఉందని రామచందర్‌రావు గుర్తుచేశారు. జనసేన ముందుగానే అభ్యర్థిని ప్రకటించడంలో తప్పేమీ లేదని, బీజేపీ తరపున కూడా నేతలు క్రియాశీలంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఈ స్థానంలో పోటీ చేసేందుకు పలువురు తమను సంప్రదిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ, పొత్తుపై జనసేన తమను సంప్రదిస్తే చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇప్పటికే జనసేన అభ్యర్థిని ప్రకటించడంతో బీజేపీతో ఆ పార్టీ ఎన్నికల సమన్వయం ఎలా ఉండబోతోందన్నది చర్చనీయాంశంగా మారింది. ఎన్డీయేలో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నప్పటికీ తెలంగాణలో ఎన్నికల విషయంలో స్పష్టమైన అవగాహనపై ఇంకా చర్చలు జరగాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి బీజేపీ-జనసేన కలిసి ముందుకు సాగుతాయా, లేక విడివిడిగా పోటీ చేస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

# జైలు సూపరింటెండెంట్‌పై ఆరోపణలు నిరాధారం

మొదటిపేజీ తరువాయి

శాఖ ఉపశాఖాధికారి ఈ మేరకు ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. అధికార దుర్వినియోగం, అవినీతి లేదా నిందితుడికి అనుచిత ప్రయోజనం కల్పించారన్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు.

**బెయిల్ విషయంలో జైలు అధికారుల పాత్ర లేదు**

నిందితులకు బెయిల్ మంజూరు చేయడం పూర్తిగా న్యాయస్థానాల పరిధిలోని అంశమని జైళ్ల శాఖ తెలిపింది. ఖైదీలకు బెయిల్ ఇప్పించే విషయంలో జైలు అధికారులకు ఎలాంటి అధికారం, పాత్ర ఉండదని స్పష్టం చేసింది. కోర్టులు జారీ చేసే ఉత్తర్వులను జైలు నిబంధనల ప్రకారం అమలు చేయడం మాత్రమే అధికారుల బాధ్యత అని పేర్కొంది. సూపరింటెండెంట్‌పై చేసిన ఆరోపణలకు ఎవరైనా నిర్దిష్ట ఆధారాలు కలిగి ఉంటే సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించింది. ఆధారాలను పరిశీలించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

**చట్టాలకు అనుగుణంగానే జైళ్ల నిర్వహణ**

తెలంగాణలో జైళ్ల నిర్వహణ పారదర్శకత, జవాబుదారీతనంతో కొనసాగుతోందని శాఖ స్పష్టం చేసింది. ఖైదీలను జైలులోకి తీసుకోవడం, భద్రత కల్పించడం, ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించడం, విడుదల చేయడం వంటి అన్ని ప్రక్రియలు చట్టబద్ధంగానే జరుగుతున్నాయని తెలిపింది. జైలు ప్రాంగణంలో ఖైదీలు అనధికారికంగా సమావేశం కావడానికి అనుమతి లేదని పేర్కొంది. భద్రతా వర్గీకరణ ఆధారంగా ఖైదీలను వేర్వేరుగా ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించింది.

జైలు సౌకర్యాలను ఉపయోగించుకుని బయట నేరాలు లేదా కుట్రలకు పాల్పడే అవకాశం ఏ ఖైదీకీ కల్పించబోమని జైళ్ల శాఖ స్పష్టం చేసింది. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత ఖైదీలతో పాటు బాధ్యులైన సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వంతు

హైదరాబాద్, అక్టోబర్ 4:

తెలంగాణలో గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీకాలం నవంబర్‌లో ముగియనున్న నేపథ్యంలో కొత్త సభ్యుల ఎంపికకు పార్టీ నాయకత్వం సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆశావహుల పేర్లపై చర్చించి, ఆమోదించిన ప్రతిపాదనలను రాజ్‌భవన్‌కు పంపే అవకాశం ఉంది. వచ్చే వారంలో రాష్ట్ర ముఖ్య నేతలతో హైకమాండ్ చర్చలు జరిపి తుది జాబితాపై నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**సామాజిక సమీకరణాలపై దృష్టి**

మూడు స్థానాల భర్తీలో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సిరిసిల్ల బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని పద్మశాలి వర్గానికి కేటాయించే అవకాశం ఉంది. కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబ సభ్యులతో పాటు కైలాస్ నేత, అనిల్ పేర్లు ఈ కోటాలో వినిపిస్తున్నాయి. పద్మశాలి వర్గానికి చెందిన నాయకుడిని ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

మిగిలిన రెండు స్థానాల్లో ఒకటి ఎస్సీ, ముఖ్యంగా మాదిగ సామాజిక వర్గానికి కేటాయించే అంశంపై చర్చ జరుగుతోంది. ఈ స్థానానికి దొమ్మాట సాంబయ్య, చారకొండ వెంకటేష్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మరో స్థానాన్ని బ్రాహ్మణ వర్గానికి కేటాయించే యోచనలో పార్టీ ఉన్నట్లు సమాచారం. ఈ స్థానానికి ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ పేరు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**మరికొందరి పేర్లపైనా పరిశీలన**

సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి, ప్రభుత్వానికి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న నేతల పేర్లను కూడా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. సమాచార హక్కు కమిషనర్ అయోధ్యరెడ్డి, గాంధీభవన్ ఇన్‌చార్జి కుమారావు పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా తుది ఎంపిక చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం

# జొమాటో డెలివరీ బాయ్‌పై దంపతుల దాడి

సికింద్రాబాద్, అక్టోబర్ 4:

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని వాసవి నగర్‌లో జొమాటో డెలివరీ బాయ్‌పై ఓ దంపతులు దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఆర్డర్ లొకేషన్‌ను మ్యాప్ తప్పుగా చూపించడంతో ఆహారం అందించడంలో కొంత ఆలస్యం అయిందని, దీనిపై కస్టమర్లకు వివరణ ఇచ్చే క్రమంలో వివాదం తలెత్తిందని సమాచారం. మాటామాటా పెరగడంతో భర్త అజయ్ డెలివరీ బాయ్ ఆశిష్‌పై దాడి చేయగా.. అతని భార్య కూడా జోక్యం చేసుకుని హ్యాండ్‌తో ఆశిష్ తలపై కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

**డెలివరీ బాయ్స్ నిరసన**

సహచరుడిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న పలువురు డెలివరీ బాయ్స్ కార్ఖానా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఇదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అజయ్ కూడా పోలీస్ స్టేషన్‌కు రావడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు**

దాడిలో గాయపడిన ఆశిష్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమారుడిపై దంపతులు తీవ్రంగా దాడి చేశారని, అతడిని చంపేందుకు ప్రయత్నించారని వారు ఆరోపించారు. ఘటనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసును ఉపసంహరించుకునేందుకు డబ్బులు ఇస్తామని చెబుతూ సెటిల్మెంట్ చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని ఆశిష్ ఆరోపించాడు. తాను స్థానికుడినంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయాడు. పోలీసుల నుంచి కూడా తగిన సహకారం లభించడం లేదని ఆరోపించిన అతను.. తనకు మద్దతుగా వచ్చిన డెలివరీ బాయ్స్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారని పేర్కొన్నాడు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కార్ఖానా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శంషాబాద్‌లో ఇండిగో విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

శంషాబాద్, అక్టోబర్ 4:

శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. పూణే నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో 6ఈ352 విమానాన్ని ల్యాండింగ్ సమయంలో పక్షి ఢీకొట్టినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్ విమానాన్ని ఎలాంటి ప్రమాదం లేకుండా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దించారు. దీంతో విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

విమానం ల్యాండ్ అయిన అనంతరం ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విమానం ముందు భాగంలో సొట్ట పడినట్లు గుర్తించారు. పక్షి ఢీకొట్టడం వల్లే ఈ నష్టం జరిగినట్లు సాంకేతిక బృందం నిర్ధారించింది. ప్రయాణికులందరినీ విమానం నుంచి దించిన అనంతరం దాన్ని సమగ్ర సాంకేతిక పరిశీలనకు తరలించారు.

**చండీగఢ్ సర్వీసు రద్దు**

షెడ్యూల్ ప్రకారం ఇదే విమానం శంషాబాద్ నుంచి చండీగఢ్ వెళ్లాల్సి ఉంది. అయితే ముందు భాగం దెబ్బతినడంతో సాంకేతిక కారణాల దృష్ట్యా ఆ సర్వీసును రద్దు చేశారు. ఈ విమానంలో ప్రయాణించాల్సిన ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ విమాన సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో ప్రతినిధులు తెలిపారు.




# రాష్ట్రంలో పిడుగులతో వర్షాలు..

హైదరాబాద్, అక్టోబర్ 4:

తెలంగాణలో పలు ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. రాబోయే సమయంలో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

**గంటకు 30–40 కి.మీ. వేగంతో గాలులు**

వర్షాలు కురిసే సమయంలో ఈదురు గాలుల తీవ్రత కూడా అధికంగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. బలమైన గాలులతో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ తీగలు తెగిపడటం, బలహీన నిర్మాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించింది. వర్షం, పిడుగుల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని అధికారులు సూచించారు.

**అక్కడక్కడా చిరుజల్లులు**

వర్ష సూచన ఉన్న జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో సాధారణంగా పొడి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ నివేదిక పేర్కొంది. అయితే కొన్ని చోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమై స్థానికంగా తేలికపాటి



జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదయ్యే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

# కరువుపై ప్రభుత్వం విఫలం..

**హైదరాబాద్, అక్టోబర్ 4:**

తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో దుర్భిక్షం నెలకొందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు 20 మీటర్ల లోతుకు పడిపోవడంతో రైతులు పంటలను కాల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జులైలో 1 శాతం, ఆగస్టులో 38 శాతం, సెప్టెంబరులో 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని కవిత తెలిపారు. సూపర్ ఎల్ నినో హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. నాగార్జునసాగర్‌లో ముఖ్యమంత్రి వరుణయాగం నిర్వహించి ప్రజలను దేవుడి దయకు వదిలేశారని విమర్శించారు.

**రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి**

ప్రస్తుతం ఉన్న 120 కోట్ల ఎకరాల పంటను కాపాడేందుకు ఎంత ఖర్చయినా భరించి నవంబర్ వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. గ్రామాల్లో కనీసం 6-7 గంటల విద్యుత్ కూడా అందడం లేదని అన్నారు.

మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించి కేంద్ర సాయం పొందేందుకు చర్యలు చేపట్టాయని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ముందుకు వెళ్లలేదని ఆరోపించారు. వెంటనే ప్రత్యేక కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి కరువు మండలాలను గుర్తించాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాల్లో కరువు తీవ్రత దృష్ట్యా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించి ఉచిత విద్యుత్, ఆర్థిక సాయం అందించాలని, లేకపోతే ప్రజలు క్షమించరని అన్నారు.

**తాగునీటి సంక్షోభంపై హెచ్చరిక**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని కవిత హెచ్చరించారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరుతున్నాయని, కృష్ణా జలాల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ నుంచి కుప్పానికి నీటిని తరలిస్తున్నా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. నార్లపూర్ రిజర్వాయర్, కల్వకుర్తి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

రైతుల సమస్యలపై తమ పార్టీ ప్రతినిధులు గ్రామగ్రామానికి వెళ్లి ప్రత్యేక కార్యాచరణ చేపడతారని కవిత వెల్లడించారు.

**ఆసుపత్రులపై ప్రత్యేక పరిశీలన**

ఆరోగ్య రంగంలోని పరిస్థితులను అధ్యయనం చేసేందుకు 'ఆపరేషన్ బ్లూ కోడ్' పేరుతో పార్టీ బృందాలు ఆసుపత్రులను పరిశీలిస్తున్నాయని తెలిపారు. భూపాలపల్లి ఆసుపత్రిలో సీలింగ్ కూలిన ఘటన, రిమ్స్ వ్యవహారాలపై పోరాటం చేసిన తర్వాతే ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసిందని అన్నారు. అయితే ఈ అంశాలను వెలుగులోకి తెచ్చిన పార్టీ కార్యకర్తలను పోలీసులు బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు.

317 జీవో బాధితులైన ఉపాధ్యాయులు, పోలీసుల సమస్యలను ప్రభుత్వం మూడేళ్లుగా పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. గాంధీ జయంతి రోజున ఉపాధ్యాయులపై లాఠీ చార్జ్ చేయడం కాంగ్రెస్ వైఖరికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో పాఠశాలల్లో కనీస సౌకర్యాలపై పరిశీలనకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

**పేపర్ బ్యాలెట్ కోసం పోరాటం**

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం ఈవీఎంలను రద్దు చేసి అమెరికా, బ్రిటన్ తరహాలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం ఢిల్లీ వరకు వెళ్లి పోరాటం చేస్తామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటుచేసుకున్న తప్పిదాలకు సీఈసీ రాజీనామా చేయడం తాత్కాలిక పరిష్కారమేనని, ఎన్నికల వ్యవస్థలో శాశ్వత మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పోటీకి సిద్ధంగా ఉందని కవిత చెప్పారు. ఎన్నికలను ప్రజా సమస్యలు, ప్రజా ఎజెండాను ముందుకు తీసుకెళ్లే వేదికగా ఉపయోగించుకుంటామని తెలిపారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక పురోగతి

- **షియర్ జోన్‌ను విజయవంతంగా దాటిన ఇంజినీరింగ్ బృందాలు**
- **43.968 కి.మీ. ప్రధాన టన్నెల్‌లో 79 శాతం పనులు పూర్తి**
- **రోజుకు 7–7.5 మీటర్ల మేర కొనసాగుతున్న తవ్వకాలు**
- **ఈ నెలాఖరుకు జర్మనీ నుంచి ఎలక్ట్రిక్ లోకోమోటివ్ రాక**
- **2028 జూన్ నాటికి నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**నల్లగొండ, అక్టోబర్ 4:**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడింది. తీవ్ర సవాళ్ల మధ్య కొనసాగుతున్న తవ్వకాల్లో ఇప్పటివరకు 700 మీటర్ల మేర పురోగతి సాధించారు. అత్యంత క్లిష్టమైన షియర్ జోన్‌ను ఇంజినీర్లు విజయవంతంగా దాటడంతో పనులు మరింత వేగం పుంజుకున్నాయి. 43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటికే 79 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. నిపుణుల పర్యవేక్షణలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ రోజుకు సగటున 7 నుంచి 7.5 మీటర్ల మేర తవ్వకాలు కొనసాగుతున్నాయి. పనుల వేగాన్ని పెంచేందుకు అదనపు డ్రిల్లింగ్ బూమర్, ఎలక్ట్రిక్ లోడర్లు, ఆధునిక ఎక్స్‌కవేటర్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.



**రవాణా సౌకర్యాల మెరుగుదల**

టన్నెల్‌లో సామగ్రి తరలింపు, పనులను వేగవంతం చేసేందుకు జర్మనీ నుంచి అత్యాధునిక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను ఈ నెలాఖరుకు తీసుకురానున్నారు. సొరంగంలో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నారు. 2028 జూన్ నాటికి ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు నీరందించేలా పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎస్ఎల్‌బీసీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీటిని అందించడమే లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఖైరతాబాద్‌లో ఓటమి భయంతోనే కోర్టు పిటిషన్లు: డీకే అరుణ

- **రేవంత్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ తీవ్ర ఆరోపణలు**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శ**
- **ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్**
- **ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా**
- **రెండు పార్టీల పాలనకు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపు**

**హైదరాబాద్, అక్టోబర్ 4:**

"ఖైరతాబాద్ నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో ఓడిపోతామనే ముందస్తు భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోర్టు ద్వారా పిటిషన్లు వేయించారు" అని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రెండు పార్టీలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు.

అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని డీకే అరుణ విమర్శించారు. ఖైరతాబాద్‌లో బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వంలో ఆందోళన మొదలైందని వ్యాఖ్యానించారు.

**ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి**

కాంగ్రెస్ ప్రభుత్వానికి తన పాలనపై, పది నెలల్లో సాధించిన అభివృద్ధిపై నమ్మకం ఉంటే.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలని డీకే అరుణ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలకు నైతికత ఉంటే పదవులకు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ అభివృద్ధికి రాజకీయ వివక్ష లేకుండా కేంద్ర నిధులు కేటాయిస్తున్నారని డీకే అరుణ పేర్కొన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పులపాలు చేశాయని ఆరోపించారు.

**రెండు పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలి**

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసు వంటివని డీకే అరుణ వ్యాఖ్యానించారు. వాటి పాలనలో తెలంగాణలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. నిధులు లేవంటూ చేతులు దులుపుకోవడం తప్ప ప్రజలకు ఈ రెండు పార్టీలు చేసిందేమీ లేదని ఆరోపించారు.



రెండు పార్టీల వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని డీకే అరుణ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో బీజేపీకి భారీ మెజారిటీతో విజయం అందించి అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని కోరారు.

# ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలి: వెంకయ్య

**హైదరాబాద్, అక్టోబర్ 4:**

యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే ఉద్యోగార్థులుగా కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన కర్నూలు సిల్వర్ జూబిలీ డిగ్రీ కళాశాల 2026 వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

**విద్యతో పాటు విలువలు ముఖ్యం**

క్రమశిక్షణ, నైతిక విలువలకు పేరుగాంచిన కర్నూలు సిల్వర్ జూబిలీ డిగ్రీ కళాశాల ఎందరో మేధావులను దేశానికి అందించిందని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ కళాశాలలో చదివిన పలువురు విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాలకు చేరడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, విలువలు, క్రమశిక్షణను అందించిన ఈ సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి గొప్ప కానుకగా నిలిచిందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర కీలకమన్నారు.




**లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలి**

ఏ రంగంలోనైనా శాశ్వత విజయాన్ని సాధించాలంటే ఓర్పు, దీక్ష, నిరంతర కృషి అవసరమని వెంకయ్య నాయుడు సూచించారు. కష్టపడకుండా విజయాన్ని అందుకోవాలనే ఆలోచన సరికాదని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని చెప్పారు. యువత తమ సామర్థ్యాలను గుర్తించి కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. విద్యా వ్యవస్థలో పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కోర్సులు పూర్తిచేసిన వెంటనే ఉపాధి అవకాశాలు పొందేలా పాఠ్యాంశాలను కాలానుగుణంగా మార్చాలని సూచించారు. విద్య పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను పెంపొందించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు.

**గురువులే మార్గదర్శకులు**

ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారిగా కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మార్గదర్శకులుగా వ్యవహరించాలని వెంకయ్య నాయుడు సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. మంచి గురువులే మంచి పౌరులను తయారు చేస్తారని పేర్కొన్నారు. సంపాదన ఒక్కటే లక్ష్యం కాకూడదని, సమాజానికి, దేశానికి తాము ఏమి తిరిగి ఇస్తున్నామనే ఆలోచన ప్రతి యువకుడిలో ఉండాలని పిలుపునిచ్చారు. విద్య, విలువలు, సామాజిక బాధ్యత కలిసినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని, దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని వెంకయ్య నాయుడు అన్నారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం.. తెలంగాణ మహిళ మృతి

- **మిస్సోరిలో వెనుక నుంచి ఢీకొట్టిన ట్రక్**
- **అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన దారం సుప్రియ**
- **మరో భారతీయ యువతికి తీవ్ర గాయాలు**
- **స్వగ్రామం మరిపెడలో విషాదఛాయలు**



**మహబూబాబాద్, అక్టోబర్ 4:**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన మహిళ మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన దారం సుప్రియ (31) మిస్సోరి రాష్ట్రంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఉద్యోగం నిమిత్తం కొంతకాలంగా ఆమె అమెరికాలో నివాసం ఉంటున్నారు.

భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో సుప్రియ ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న సుప్రియ అక్కడికక్కడే మృతిచెందగా, అదే కారులో ప్రయాణిస్తున్న భారత్‌కు చెందిన మరో యువతి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

**కుటుంబంలో విషాదం**

సుప్రియకు కొంతకాలం క్రితమే వివాహమైంది. ఆమె భర్త కొదుమూరి రంజిత్‌తో పాటు అత్తమామలు కొదుమూరి వెంకటేశ్వర్లు, రాధిక ప్రస్తుతం మహబూబాబాద్‌లోని వీరభద్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. సుప్రియ మృతిచెందిన విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన సుప్రియ అక్కడే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆమె స్వగ్రామం మరిపెడలోనూ విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె మృతిని కుటుంబ సభ్యులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు.



# ఫారమ్7 దుర్వినియోగం చేస్తే ఊరుకోం

- **తప్పుడు దరఖాస్తులపై ఈసీ చర్యలు తీసుకోవాలని ఓవైసీ డిమాండ్**
- **బీజేపీ, సంఘ్ పరివార్‌పై ఎంఐఎం చీఫ్ ఆరోపణలు**
- **తెలంగాణ సీఈఓ, డీఈఓలకు సమాచారం ఇచ్చామని వెల్లడి**
- **ఫారమ్-7 దుర్వినియోగం కొనసాగితే హైదరాబాద్‌లో భారీ ఆందోళన**

**హైదరాబాద్, అక్టోబర్ 4:**

"ఫారమ్7 దుర్వినియోగం ఇలాగే కొనసాగితే మజ్లిస్ మౌనంగా ఉండదు. ఢిల్లీలో జంతర్ మంతర్‌లో జరిగిన నిరసన కంటే పెద్ద ఎత్తున హైదరాబాద్ రోడ్లు, వీధుల్లో ఆందోళన చేపడతాం" అని ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హెచ్చరించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించేందుకు ఫారమ్7 దరఖాస్తులను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముద్రించిన ఫారమ్7 దరఖాస్తుల్లో తొలగించాల్సిన ఓటర్ల పేర్లు, వారి వివరాలు ఉంటున్నాయని ఓవైసీ తెలిపారు. బీజేపీ, సంఘ్ పరివార్‌కు చెందిన వారు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలు నిజమైతే పూర్తిగా తప్పని పేర్కొన్న ఆయన.. తప్పుడు దరఖాస్తులు సమర్పిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులకు ఈ అంశంపై సమాచారం అందిస్తున్నామని ఓవైసీ వెల్లడించారు. ఫారమ్7లను దుర్వినియోగం చేసి ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**యూపీలో పొత్తులకు సిద్ధం**

యూపీ అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఓవైసీ స్పందించారు. ఇతర పార్టీలతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడాన్ని తాము కోరుకోవడం లేదని, దాన్ని అడ్డుకునేందుకు పొత్తుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గతంలో బిహార్‌లో తమ నలుగురు ఎమ్మెల్యేలను ఆర్జేడీ తమతో కలుపుకుందని ఓవైసీ గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో తాము ఆరు సీట్లు మాత్రమే అడిగామని చెప్పారు. మళ్లీ పోటీ చేస్తే ప్రజలు తమను ఐదు సీట్లలో గెలిపించారని పేర్కొన్నారు. శివసేన చీలిపోయిన సమయంలో దానిని ప్రజాస్వామ్య హత్యగా అభివర్ణించినవారు.. తమ ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

# సరిహద్దు ఉగ్రవాదంపై పాక్‌కు భారత్ గట్టి హెచ్చరిక

- **చొరబాట్లు, ఉగ్ర కార్యకలాపాలపై తీవ్ర నిరసన**
- **న్యూఢిల్లీలో పాక్ దౌత్యవేత్తకు అధికారిక నోటీసులు**
- **దేశ సార్వభౌమత్వం, భద్రతపై రాజీపడేది లేదన్న భారత్**
- **అక్రమ చొరబాట్లను అడ్డుకోవాలని పాక్‌కు డిమాండ్**

**న్యూఢిల్లీ, అక్టోబర్4:**

భారత్‌లోకి సరిహద్దుల మీదుగా కొనసాగుతున్న చొరబాట్లు, ఉగ్రవాద కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పాకిస్తాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తూ.. న్యూఢిల్లీలోని పాక్ దౌత్యవేత్తకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటీసులు అందజేసింది. సరిహద్దు భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లను భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమత్వం, జాతీయ భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఉగ్రవాదం, చొరబాట్లకు అడ్డుకట్ట వేయాలని సూచిస్తూ.. సరిహద్దు అవతలి నుంచి జరుగుతున్న ఇటువంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని పాకిస్తాన్‌ను భారత్ డిమాండ్ చేసింది. ఉగ్రవాద కార్యకలాపాల నియంత్రణతో పాటు అక్రమ చొరబాట్లను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. జాతీయ భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది.



# ఫిరోజాబాద్‌లో టైర్ల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

- ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. ఎగసిపడిన అగ్నికీలలు
- పెద్ద మొత్తంలో మండే పదార్థాలు ఉండటంతో వేగంగా వ్యాప్తి
- దట్టమైన పొగలతో పరిసర ప్రాంతాల్లో భయానక వాతావరణం

**ఫిరోజాబాద్, అక్టోబర్ 4:**

ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో ఓ టైర్ల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీగా అగ్నికీలలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే చర్యలు చేపట్టారు. కంపెనీలో పెద్ద మొత్తంలో మండే పదార్థాలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదంతో దట్టమైన పొగలు అలుముకోవడంతో కొంతసేపు అక్కడ భయానక పరిస్థితి నెలకొంది. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.

**కార్మికుల వివరాలు తెలియాల్సి ఉంది**

ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలో ఎంతమంది కార్మికులు ఉన్నారు? ఎవరైనా గాయపడ్డారా? అనే వివరాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ప్రస్తుతం అధికారులు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన అనంతరం ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టనున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరపనున్నారు. ప్రస్తుతం కంపెనీ వద్ద మంటలను అదుపులోకి తెచ్చే చర్యలు కొనసాగుతున్నాయి.

# హసీనా అప్పగింతకు గడువు లేదు

**ఢాకా, అక్టోబర్ 4:**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి అప్పగించే విషయంలో భారత్ ఎలాంటి గడువు విధించలేదని బంగ్లాదేశ్‌లో భారత హైకమిషనర్ దినేష్ త్రివేదీ తెలిపారు. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ నుంచి పదేపదే విజ్ఞప్తులు వస్తున్నప్పటికీ, వాటిని భారత్ చట్టబద్ధమైన ప్రక్రియలో పరిశీలిస్తోందని స్పష్టం చేశారు. ఢాకాలో ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

హసీనా అప్పగింతపై కాలపరిమితి లేదని చెబుతూ.. ఎప్పుడు ఆమెను బంగ్లాదేశ్‌కు పంపాలనే దానిపై భారత్ ఎలాంటి గడువు ప్రకటించలేదని దినేష్ త్రివేదీ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని, తదుపరి నిర్ణయం చట్టబద్ధమైన ప్రక్రియ ఆధారంగానే ఉంటుందని తెలిపారు.

హసీనా భారత్‌కు వచ్చిన తీరుపై కూడా ఆయన వివరణ ఇచ్చారు. ఆమెను భారత ప్రభుత్వం తీసుకురాలేదని, భారత వైమానిక దళం లేదా సైన్యం ఆమెను భారత్‌కు తరలించలేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో అప్పట్లో నెలకొన్న హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో హసీనా స్వయంగా భారత్‌కు వచ్చారని చెప్పారు. ఆమె ప్రధానమంత్రి హోదాలో భారత్‌కు వచ్చిన సమయంలో పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని దేశంలో ఉండేందుకు అనుమతించినట్లు వివరించారు. బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాత్మక పరిణామాలు మరే దేశంలోనూ పునరావృతం కాకూడదని దినేష్ త్రివేదీ అన్నారు. ఆ సమయంలో మానవతా దృక్పథంతో హసీనాకు భారత్‌లో ఉండేందుకు అవకాశం కల్పించినట్లు ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. హసీనా అప్పగింత అంశం భారత్‌బంగ్లాదేశ్ మధ్య దౌత్య చర్చల్లో కొనసాగుతోంది. బంగ్లాదేశ్ తన విజ్ఞప్తిని పునరావృతం చేస్తున్నప్పటికీ.. భారత్ మాత్రం చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తున్నట్లు హైకమిషనర్ స్పష్టం చేశారు.

# బంగారం, వెండిపై దిగుమతి జీఎస్టీ మినహాయింపుకు చెక్?

- అక్రమ బంగారం రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4:**

బ్యాంకులు, నామినేటెడ్ ఏజెన్సీలు దిగుమతి చేసుకునే బంగారం, వెండి, ప్లాటినంపై అమల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) మినహాయింపును తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 7న జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులపై 3 శాతం ఐజీఎస్టీ విధిస్తున్నారు. అయితే కేంద్రం గుర్తించిన కొన్ని బ్యాంకులు, నామినేటెడ్ ఏజెన్సీలకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఉంది. 2017లో వాణిజ్యాన్ని సులభతరం చేయాలనే ఉద్దేశంతో ఈ రాయితీని అమల్లోకి తీసుకొచ్చారు.

**మార్కెట్లో పారదర్శకతకు అవకాశం**

మినహాయింపును తొలగిస్తే బులియన్ ఎక్స్ఛేంజీలు, నామినేటెడ్ ఏజెన్సీలు సహా దిగుమతిదారులందరికీ ఒకే విధమైన పన్ను విధానం వర్తించనుంది. బ్యాంకులు, జ్యువెలర్స్ ద్వారా చట్టబద్ధమైన మార్గాల్లో బంగారం దిగుమతి చేసుకునే ప్రక్రియ మరింత సులభతరం కావచ్చని వర్గాలు భావిస్తున్నాయి. పన్ను భారం స్వల్పంగా తగ్గడం ద్వారా అక్రమ బంగారం రవాణా తగ్గే అవకాశం ఉందని, మార్కెట్లో సరఫరా పెరిగి ధరల్లో పారదర్శకతకు దోహదపడొచ్చని చెబుతున్నాయి.

**ఫారెక్స్ నిల్వలపై ఆందోళన**

చైనా తర్వాత ప్రపంచంలో అత్యధికంగా బంగారం వినియోగించే దేశంగా భారత్ ఉంది. ముఖ్యంగా ఆభరణాల పరిశ్రమకు భారీ డిమాండ్ ఉండటంతో దేశం పెద్ద మొత్తంలో బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. విలువైన లోహాల దిగుమతుల కోసం విదేశీ మారకద్రవ్యం పెద్దఎత్తున బయటికి వెళ్తుండటం ఫారెక్స్ నిల్వలపై ప్రభావం చూపుతోందన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో ఉంది.

# ఇండియా కూటమిలోకి టీవీకే

- తమిళనాడులో ఇండియా కూటమితో చేతులు కలిపిన విజయ్ పార్టీ
- చేరిక చారిత్రాత్మక పరిణామమన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్కం ఠాగూర్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు జిల్లాల వారీగా నిరసనలకు నిర్ణయం
- అక్టోబర్ 13, 14న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు.. 15న చెన్నైలో భారీ నిరసన
- అక్టోబర్ 6న ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద ఇండియా కూటమి ఎంపీల నిరసన

**చెన్నై, అక్టోబర్ 4:**

తమిళ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (TVK) తమిళనాడులో ఇండియా కూటమిలో చేరింది. శనివారం చెన్నైలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) కార్యాలయంలో జరిగిన కూటమి సమావేశానికి TVK ప్రతినిధులు ఆధవ్ అర్జున, మారియా విల్సన్ హాజరయ్యారు. ఈ పరిణామాన్ని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్కం ఠాగూర్ చారిత్రాత్మక రోజుగా అభివర్ణించారు. TVK చేరికతో రాష్ట్రంలో కూటమి మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

**సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ఇండియా కూటమి పార్టీలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీల్లో తమిళనాడు వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని నిర్ణయించినట్లు మాణిక్కం ఠాగూర్ తెలిపారు. అక్టోబర్ 15న చెన్నైలో ఇండియా కూటమిలోని ఏడు పార్టీల నేతలతో సంయుక్త నిరసన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**అక్టోబర్ 6న ఢిల్లీలో ఆందోళన**



ఎన్నికల జాబితా సవరణ, ఈవీఎంలపై అభ్యంతరాలు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్లపై సెప్టెంబర్ 30న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. ఈ అంశాలపై దేశవ్యాప్తంగా నిరసనలను విస్తరించాలని నిర్ణయించారు. అక్టోబర్ 6న ఇండియా కూటమి ఎంపీలు ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వైపు నిరసన ప్రదర్శన చేపట్టనున్నారు.

**అరెస్టులకూ సిద్ధమే: కాంగ్రెస్**

సీఈసీకి వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనల్లో అరెస్టులకూ సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ, ముంబైలో నిరసనలు జరిగిన నేపథ్యంలో మరిన్ని కార్యక్రమాలకు ఇండియా కూటమి సిద్ధమవుతోంది.

# 20 ఏళ్ల నాటి కేసులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై మళ్లీ విచారణ

- 2006 నాటి కేసుపై విజిలెన్స్ దర్యాప్తునకు కేరళ హోంమంత్రి ఆదేశం
- అప్పట్లో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న జ్ఞానేశ్ కుమార్
- మలేషియా ఇంజినీర్ లీ సీ బీన్ ఆత్మహత్యతో ముడిపడిన కేసు
- సుసైడ్ నోట్‌లో జ్ఞానేశ్ కుమార్ పేరు ఉందన్న ఆరోపణలు
- గత విచారణపై ఒత్తిడి ఏమైనా ఉందా? ఆరా తీయనున్న విజిలెన్స్

**తిరువనంతపురం, అక్టోబర్ 4:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు సంబంధించిన 20 ఏళ్ల నాటి కేసును కేరళ ప్రభుత్వం మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. 2006లో కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా ఉన్న సమయంలో చోటుచేసుకున్న ఆరోపణలపై విజిలెన్స్ దర్యాప్తునకు రాష్ట్ర హోంమంత్రి రమేష్ చెన్నితల ఆదేశించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో పాటు, మలేషియా సివిల్ ఇంజినీర్ లీ సీ బీన్ ఆత్మహత్యకు సంబంధించిన అంశాలను కూడా దర్యాప్తులో పరిశీలించనున్నారు.

**కాంట్రాక్టుల వ్యవహారంలో ఆరోపణలు**

కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ (KSTP) లో భాగంగా ఎంసీ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టిన PATIBEL కన్సార్టియంతో లీ సీ బీన్ సంబంధం కలిగి ఉన్నారు. 2006లో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. అప్పట్లో ఆయన రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో జ్ఞానేశ్ కుమార్ పేరును ప్రస్తావించినట్లు ఆరోపణలు వచ్చాయి. పనులకు సంబంధించిన చెల్లింపుల విషయంలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు కూడా అప్పట్లో వెలువడ్డాయి.

**గత విచారణపైనా ఆరా**

లీ సీ బీన్ మృతితో అప్పట్లో విజిలెన్స్ ప్రాథమిక విచారణ ప్రారంభమైంది. అయితే ఆ దర్యాప్తు మధ్యలోనే నిలిచిపోయిందని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. గత విచారణపై ఏమైనా బాహ్య ఒత్తిడి పనిచేసిందా? దర్యాప్తు ఎందుకు ముందుకు సాగలేదు? అనే అంశాలను తాజా విచారణలో పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించిన 2006 నాటి విజిలెన్స్ దర్యాప్తు ఫైళ్లను కూడా కేరళ హోం శాఖ కోరింది. ప్రస్తుతం సీఈసీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్‌పై ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) అంశంలో ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్న సమయంలో ఈ పాత కేసుపై కేరళ ప్రభుత్వం తాజా విచారణకు ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే గత ఆరోపణలు, ప్రస్తుత విచారణలో తేలే అంశాలు వేర్వేరు అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# జంతర్ మంతర్ వద్ద మహిళా జర్నలిస్టులపై వేధింపుల ఆరోపణలు

- ముగ్గురు మహిళా జర్నలిస్టుల ఫిర్యాదులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ
- ఏసీపీ వివేక్ భగత్ అసభ్యంగా తాకి వెనక్కి నెట్టారని ఆరోపణ
- మహిళా పోలీసు సిబ్బంది లేకపోవడాన్ని ప్రశ్నించడంతో ఘటన జరిగిందని ఫిర్యాదు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలన్న రాహుల్ గాంధీ
- జర్నలిస్టులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ డిమాండ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4:**



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద శనివారం జరిగిన నిరసనలో మహిళా జర్నలిస్టులపై పోలీసుల వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. నిరసన కవరేజీలో ఉన్న ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఢిల్లీ పోలీసులపై ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో మహిళా పోలీసులు లేకపోవడాన్ని ప్రశ్నించగా, ఏసీపీ వివేక్ భగత్ తనను అసభ్యంగా తాకి వెనక్కి నెట్టారని ఓ మహిళా జర్నలిస్ట్ ఆరోపించారు. ఈ ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ కోసం వాటిని క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

**రాహుల్ గాంధీ స్పందన**

ఈ ఘటనపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఢిల్లీ పోలీస్ శాఖ కేంద్ర హోంశాఖ పరిధిలో ఉన్నందున మహిళా జర్నలిస్టులపై అనుచితంగా వ్యవహరించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టు ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యంపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

**క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు**

ముగ్గురు మహిళా జర్నలిస్టుల నుంచి ఫిర్యాదులు అందాయని ఢిల్లీ పోలీసులు తెలిపారు. న్యూఢిల్లీ జిల్లా పోలీసులు వాటిని కమలా మార్కెట్‌లోని క్రైమ్ బ్రాంచ్‌కు తదుపరి చర్యల కోసం బదిలీ చేశారు. ఫిర్యాదుదారులతో పాటు ఘటనకు సంబంధించిన ఇతర వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేసి ఆరోపణలను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలో మహిళా జర్నలిస్టులు, మహిళా నిరసనకారులు, న్యాయవాదులతో పురుష పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఏఐఎస్ఏ ఆరోపించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కూడా ఏసీపీ వివేక్ భగత్‌పై ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలపై తుది వాస్తవాలు క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆందోళన**

జంతర్ మంతర్ వద్ద జర్నలిస్టుల పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టులు ఎలాంటి భయం లేకుండా తమ విధులు నిర్వహించేలా వాతావరణం కల్పించాలని కోరింది. మహిళా జర్నలిస్ట్ చేసిన ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను డిమాండ్ చేసింది.

# రాజ్యసభ బరిలో బీజేపీ అభ్యర్థులు ఖరారు

- ఉత్తరాఖండ్ నుంచి దినేష్ ఆర్యకు అవకాశం
- బెంగాల్ రాజ్యసభ ఉపఎన్నికకు కోయెల్ మల్లిక్ ఎంపిక
- టీఎంసీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన కోయెల్
- అక్టోబర్ 16న బెంగాల్ రాజ్యసభ ఉపఎన్నిక
- నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి రంగం సిద్ధం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4:**

రాజ్యసభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థులను ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లో జరగనున్న రాజ్యసభ ఎన్నికకు దినేష్ ఆర్యను, పశ్చిమ బెంగాల్‌లో ఖాళీ అయిన స్థానానికి జరగనున్న ఉపఎన్నికకు నటి, రాజకీయ నాయకురాలు రుక్మిణి మల్లిక్ అలియాస్ కోయెల్ మల్లిక్‌ను పార్టీ అభ్యర్థులుగా ఖరారు చేసింది.

**ఉత్తరాఖండ్‌లో దినేష్ ఆర్య**

ఉత్తరాఖండ్ బీజేపీలో చాలాకాలంగా క్రియాశీలకంగా పనిచేస్తున్న దినేష్ ఆర్యకు పార్టీ రాజ్యసభ అవకాశం కల్పించింది. రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీకి ఉన్న మెజారిటీ నేపథ్యంలో ఈ స్థానాన్ని ఆ పార్టీ దక్కించుకునే పరిస్థితి ఉంది.

**బెంగాల్‌లో కోయెల్ మల్లిక్ పోటీ**

పశ్చిమ బెంగాల్ రాజ్యసభ ఉపఎన్నికకు కోయెల్ మల్లిక్‌ను బీజేపీ బరిలోకి దింపింది. గతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో ఉన్న ఆమె ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తాజాగా రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించడం బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ 16న ఈ ఉపఎన్నిక జరగనుండగా, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.



# మల్లుపల్లిలో పత్తి తూకాల మోసం బట్టబయలు

- ఎలక్ట్రానిక్ కాంటాకు సీక్రెట్ రిమోట్?

**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

రైతు చెమటోడ్చి పండించిన పత్తికి గిట్టుబాటు ధర దక్కకపోగా, తూకాల్లోనూ మోసాలకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామంలో పత్తి కొనుగోళ్ల సమయంలో ఎలక్ట్రానిక్ కాంటాకు సీక్రెట్ రిమోట్ ను అనుసంధానం చేసి తూకాలను మార్చుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.

ఒక పత్తి వ్యాపారి రైతుల వద్ద పత్తి కొనుగోలు చేసే సమయంలో ఎలక్ట్రానిక్ కాంటాకు చిన్న రిమోట్ పరికరాన్ని అనుసంధానం చేసి రహస్యంగా ఆపరేట్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు పత్తి బస్తాలను కాంటాపై ఉంచిన సమయంలో రిమోట్ ద్వారా తూకాన్ని తగ్గిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.




**50 కిలోల బస్తాలో మాయాజాలం?**

రైతుల కథనం ప్రకారం సుమారు 50 కిలోల పత్తి ఉన్న బస్తాను కాంటాపై ఉంచినప్పుడు రిమోట్ ద్వారా తూకంలో 3 నుండి 5 కిలోల వరకు కోత పెడుతున్నారని, యంత్రంలో కనిపించే సంఖ్యను నమ్మి రైతులు మోసపోతున్నారని చెబుతున్నారు.పత్తి సాగు కోసం పెట్టుబడులు పెట్టి నెలల తరబడి కష్టపడి పండించిన రైతులకు తూకాల్లోనే మోసం జరిగితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని స్థానికులు అంటున్నారు.

**అధికారులు తనిఖీ చేయాలి - రైతుల డిమాండ్**

ఈ వ్యవహారంపై తూనికలు–కొలతల శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాంటాలకు అనధికారిక పరికరాలు, రిమోట్లు అమర్చారా? తూకాల్లో అవకతవకలు జరుగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## పేషెంట్లకు కుళ్లిన కూరగాయలతో వంట

- కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకోవాలి
- సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**



వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాత శిశు ఆసుపత్రిలో పేషెంట్లకు కూల్లిన కూరయాలతో వంట చేసి పెడుతున్న భోజనం పెడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని వెంటనే కాంటాక్ట్ రద్దు చేయాలి సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పేషంట్లతో మాట్లాడి భోజనం వంటగదిని పరిశీలించడం జరిగింది. సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ప్రభుత్వ ఆసుపత్రిలో కూల్లిలనా కూరగాయలతో వంటలు చేసి నాణ్యతలేని భోజనం పెడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని, కాంట్రాక్ట రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ ఆస్పత్రిలో భోజనము కూరగాయలు పండ్లు గుడ్ల పాలు టిఫిన్ సక్రమంగా పెట్టడంలేదన్నారు. ఈ విషయం పై గతంలో అనేకసార్లు ఆసుపత్రి సూపరిండెంట్ కు, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన, కాంట్రాక్టర్ వంట వారి పనితీరు మారడం లేదు. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టర్ పై చట్ట పరమైన చర్యలు తీసుకొని కాంట్రాక్ట రద్దు చేసి నూతన కాంట్రాక్టరు ను ప్రభుత్వాం ఎర్పాటు చెయ్యాలని డిమాండ్ రాయి చేస్తున్నామన్నారు. లేనిచో ఆందోళన పోరాటలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు టంకరీ రాజేందర్ కుమార్తె శ్రీజ కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా, ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విద్యార్థిని శ్రీజను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడి చదివి మెడికల్ సీటు సాధించిన విద్యార్థిని పట్టుదల, కృషి అభినందనీయమని కొని యాడారు. ఆమె సాధించిన ఈ గొప్ప విజయం పోసానిపేట్ గ్రామానికే కాకుండా మొత్తం కామారెడ్డి జిల్లాకే గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో ఆమె ఉన్నత చదువులు పూర్తి చేసి, సమాజానికి ఉత్తమ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం రోజున మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధిత కుటుంబాలను కట్లకుంట సుధాకర్ తల్లి, కార్యకర్త అయినటువంటి మంగలి రామస్వామి, అలాగే చతార బోయిన సుధాకర్ వాళ్ళ అత్తమ్మ ఇటీవల మరణించినందున వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండాలి తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆయన వెంట మర్కంటి బుచ్చన్న, నారాయణరెడ్డి, దశరథ్ రెడ్డి, రాజేందర్ గౌడ్, సుధాకర్, నర్సారెడ్డి, మైపాల్, శ్రీకాంత్, సుద్దాల లింగం, రాజయ్య, రాజారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కురుమ యువ చైతన్య జిల్లా కమిటీ ఎన్నిక




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

కామారెడ్డి జిల్లా నూతన కురుమ యువ చైతన్య జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా చెట్కూరి రజినీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్, అంబల సాయి నిఖిల్, జీవియం విఠల్, ప్రధాన కార్యదర్శి చిన్న రవ్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పుల్ల గంగాధర్, నార్ల మల్లేష్ , కోశాధికారి కందూరి ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి అనిల్, కార్యదర్శి రెడ్డి మల్లేష్,చెట్కూరి ప్రణీత, సలహాదారులని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమల హక్కుల కోసం పోరాడాలని విద్యా,ఉపాధి ,రాజకీయంగా ఎదగాలని అన్నారు. దొడ్డి కొమురయ్య ఆశయాలతో పనిచేయాలని వారి వారసత్వని కొనసాగించాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే రవి కుర్మా, కన్వీనర్ కొండే శ్రీకాంత్ కురుమ వ్యవస్థాపకులు చెట్టె భాస్కర్, చెలమేటి గంగాధర్, గర్గుల బాబు, ధరణి శ్రీను, కొండ మధు కురుమ సభ్యులు పాల్గొన్నారు.

## అంతక్రియలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో ఆదివారం రోజున మాజీ మండల రైతు బంధు అధ్యక్షులు గురజాల నారాయణరెడ్డి తల్లి నరసవ్వ మరణించినందున ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అంత్యక్రియలు పాల్గొని పార్థివ దేహానికి పూలమాల వేశారు, బాధలో ఉన్న నారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు, మాజీ ఎమ్మెల్యే వెంట మర్కంటి బుచ్చన్న, కపిల్ రెడ్డి, దశరథ్ రెడ్డి, సుద్దాల లింగం, తంకర్ రవి, లింగం, తిరుపతి, సంతోష్ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బ్రదర్ షఫీ భాయ్




- పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్**

వరంగల్–ఖమ్మం–నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకం భారత్ పార్టీ తరఫున అభ్యర్థిగా బ్రదర్ షఫీ భాయ్ పోటీ చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. "యువత మేల్కొని ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి. మీ ఓటు.. మీ భవిష్యత్తు" అని ఆయన అన్నారు. యువత, ఉద్యోగులు, విద్యావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు కొనసాగుతుందని,అర్హులు ఫారం18 ద్వారా అవసర మైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం టెండర్ ప్రకటన

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా, మాచారెడ్డి మండలం, చుక్కాపూర్ గ్రామంసమస్త భక్త జనులకు తెలియజేయునది ఏమనగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం , చుక్కాపూర్ నందు లడ్డు పులిహోర ప్రసాదములు అమ్ముకొనుటకు రెండు 'సంవత్సరాల కాల పరిమితికి గాను తేది : 06 -10 -2026 మంగళ వారం రోజున ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలము , ఆలయ ఈవో రవీందర్ గుప్తా, ఆలయ కమిటి చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఆసక్తిగల పాల్గొనవలసినదిగా కోరుతున్నాము.

## కామంచికల్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రి పొంగులేటి



- తీర్థాలలో మూడు కుటుంబాలకు పరామర్శ

**ఖమ్మం రాజముద్ర న్యూస్**



ఖమ్మం రూరల్ ఇటీవల వ్యవసాయ కూలి పనులకు వెళ్లి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కామంచికల్ గ్రామానికి చెందిన దొంతుసరుపు భారతమ్మ నివాసానికి వెళ్లి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే...ఆ ప్రమాదంలో గాయపడిన మరో 11 మంది కూలీలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ ఈ కుటుంబాలకు తన వంతు సహకారం అందిస్తూ.. ఉండగా నిలుస్తానని అభయం ఇచ్చారు.

**తీర్థాల గ్రామంలో**

ఇటీవలి కాలంలో వివిధ కారణాలతో చనిపోయిన బానోత్ శాంత, ఎస్ కే. అశ్వాన్, శీతల నాగరాజు ఇళ్లకు వెళ్లి.. వారి చిత్రపటాల వద్ద మంత్రి పొంగులేటి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు ప్రతాపనేని రఘు, బోడా వెంకన్న, కిరణ్ కుమార్ నాయక్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి వనమా వాసు భారీ విరాళం లక్ష రూపాయలు అందజేత



**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

తల్లాడ మండల కేంద్రంలోని రింగు రోడ్డు సెంటర్ లో ఏర్పాటు చేస్తున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు భారీ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు వనమా వాసు రూ.లక్ష విరాళం అందజేశారు.ప్రస్తుతం విగ్రహం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాట్ల పురోగతిని వనమా వాసు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాలకు, పార్టీ జెండా దిమ్మెలకు వాసు ఆర్థిక సహాయం చేయడం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడ్ హక్ కమిటీ సభ్యులు కొండబాల కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు కేతినేని హరీష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గడిపూడి వెంకటేశ్వరరావు, నాగార్జున శ్రీనివాస్, కూచిపూడి వెంకటేశ్వరరావు, కొమ్మినేని రామయ్య, నున్నా తారకరామారావు, కొమ్మినేని నరసింహారావు, కొమ్మినేని సత్యనారాయణ, నల్లమోతు సత్యనారాయణ, కొమ్మూరి అప్పారావు, కర్ణాటి అశ్వనీకుమార్, వనమా సతీష్, కామినేని శ్రీనివాస్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో ఆదివారం రోజున ప్రభుత్వ మాజీ విప్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశానుసారము అన్నారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సూరంపల్లి పెంటయ్య బిఆర్ఎస్ కార్యకర్త కుమారుడు సూరంపల్లి ప్రభాకర్ వారం రోజుల క్రితం పరమపదించారు వారి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున వారికి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 20 వేల రూపాయలు సహాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో చెస్ పోటీలు ప్రారంభం

**క్రీడాస్ఫూర్తితో రాణించాలి: డివైపీఎం హరీష్**

**కొత్తగూడెం, రాజముద్ర న్యూస్ :**

కొత్తగూడెం ఏరియాలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం చెస్ విభాగపు పోటీలు ప్రారంభమయ్యాయి. డివైపీఎం జి. హరీష్, ఏఐటీయూసీ ప్రతినిధి ఎం. మధుకృష్ణ, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో రాణించి కొత్తగూడెం ఏరియా పేరు నిలబెట్టాలని హరీష్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ జనరల్ కెప్టెన్ రాజశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నా

# క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతి..

## ఇకపై 40 శాతం మరణాలు నివారించవచ్చు

ప్రపంచ వ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడేవారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. దీనికి ప్రధాన కారణం చివరి దశలో ఈ క్యాన్సర్ గుర్తించడమే. అయితే తాజా పరిశోధనలు ఈ క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతిని కనుగొన్నారు. దీని ద్వారా 40 శాతం మరణాలను అడ్డుకోవచ్చంటున్నారు పరిశోధకులు.. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ సర్వసాధారణంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రొమ్ము క్యాన్సర్ తర్వాత, ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో అత్యధిక సంఖ్యలో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుయి. మరణాల పరంగా రొమ్ము క్యాన్సర్ కంటే గర్భాశయ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనది. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా దాదాపు 4 లక్షల మంది మహిళలు ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. గర్భాశయ క్యాన్సర్ కేసుల్లో చాలా వరకు చివరి దశలో అభివృద్ధి చెందుతాయి. ఇది చికిత్సను కష్టతరం చేస్తుంది. దీంతో మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పరిశోధకుల రీసెర్చ్ ఈ వ్యాధి చికిత్సలో గొప్ప విజయాన్ని సాధించారు. ఈ చికిత్సతో సర్వైకల్ క్యాన్సర్ మరణాలను 40 శాతం తగ్గించవచ్చని అంటున్నారు.



### ఈ కొత్త టెక్నాలజీతో సర్వైకల్ క్యాన్సర్ చికిత్స...

పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ కేసుల దృష్ట్యా.. వైద్యులు మెరుగైన చికిత్సను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు. సంవత్సరాలుగా దానిపై అధ్యయనాలు చేస్తున్నారు. ఇటీవల వైద్యులు దాని చికిత్సలో సానుకూల ఫలితాలను పొందారు. ఈ పరిశోధనకు యూకే, మెక్సికో, భారత్, ఇటలీ, బ్రెజిల్‌లతో సహా 10 సంవత్సరాలకు పైగా ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలను తీసుకున్నారు. ఈ చికిత్సలో కెమోరేడియేషన్‌కు ముందు కీమోథెరపీని చిన్న సెషన్‌లు ఇచ్చారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ నేతృత్వంలోని ఈ పరిశోధన మూడవ, నాల్గవ దశ క్యాన్సర్ చికిత్సలో చాలా మంచి ఫలితాలను చూపించింది. ఫలితంగా ఈ వ్యాధి నుండి మరణించే ప్రమాదాన్ని 40 శాతం తగ్గించవచ్చని తేలింది. పైగా ఈ క్యాన్సర్ మళ్లీ వచ్చే ప్రమాదం 35 శాతం తగ్గింది కూడా. మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన ఫేజ్ 3 ట్రయల్‌లో విజయవంతమైనట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త చికిత్స విధానంపై పెద్ద ఎత్తున పరిశోధన చేయనప్పటికీ, ఈ పరిశోధన ఫలితాలు గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో గొప్ప విజయంగా భావిస్తున్నారు.



### ప్రతి ఏడాది 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల్లో సగానికి పైగా మరణిస్తున్నారు. దీని బారిన పడిన స్త్రీలలో చాలా మంది దాదాపు 50 సంవత్సరాల వయస్సు గలవారు ఉంటున్నారు. 30 నుండి 40 శాతం కేసులలో ఈ క్యాన్సర్ నయమైన తర్వాత మళ్లీ తిరిగి వస్తుంది. రెండో సారి తిరగబెట్టినప్పుడు ఇది మరింత ప్రాణాంతకంగా మారి మరణానికి కారణమవుతుంది. గర్భాశయ క్యాన్సర్‌లో మరణాల సంఖ్య పెరగడానికి కారణం ఆలస్యంగా గుర్తించడమే. చాలామంది మహిళలు నాల్గవ దశలో ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు ఆధునాతన చికిత్సను కనుగొన్నారు. దీని ద్వారా క్యాన్సర్‌ను తొలినాళ్లలోనే గుర్తించి, చికిత్స చేసేందుకు సాధ్యమవుతుంది . తద్వారా మరణ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### గర్భాశయ క్యాన్సర్‌ను ఎలా నివారించాలి...

- ధూమపానం మానుకోవాలి
- ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉండటం
- చిన్నవయసులోనే శారీరక సంబంధాలు పెట్టుకోకపోవడం మంచిది
- గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా తీసుకోకూడదు
- సర్వైకల్ క్యాన్సర్‌ను పరీక్షించడానికి ఎప్పటికప్పుడు పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలి
- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడానికి టీకాలు వేయించుకోవాలి

### గర్భాశయ క్యాన్సర్ ఎందుకు వస్తుంది...?

- ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలను కలిగి ఉండటం
- ధూమపానం
- గర్భనిరోధక మాత్రలు అధికంగా తీసుకోవడం కలిగి ఉండటం



## వెన్నునొప్పితో బాధపడుతున్నారా?

# ఇలా చేస్తే ఉపశమనమే..



ప్రస్తుత రోజుల్లో చాలామంది ఒకే చోట కదలకుండా గంటల తరబడి కూర్చుని పనిచేస్తుంటారు. దీని వల్ల వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను ఇలాగే వదిలేస్తే అనతి కాలంలోనే సమస్య తీవ్రం అవుతుంది. ఇలా అవకుండా ఉండాలంటే.. గంటల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల వెన్నుపాము నొప్పి రావడం సాధారణ సమస్యగా మారింది. ఈ సమస్య ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతుంది. కానీ కొంతమందిలో ఇది చాలా కాలం పాటు కొనసాగుతుంది. దీనివల్ల ఏ పని చేయాలన్నా ఇబ్బందులు పడుతుంటారు. చాలా మంది వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వెన్నెముక కూడా దెబ్బతింటుంది. దీని కారణంగా హెర్నియేటెడ్ డిస్క్, వెన్నునొప్పి, పార్శ్వగూని వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని ఢిల్లీలోని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్‌లో వెన్నెముక సేవల చీఫ్ డాక్టర్ వికాస్ టాండన్ అంటున్నారు. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, కీళ్లనొప్పులు, వెన్నుపాము దెబ్బతినడానికి కూడా దారితీయవచ్చు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ చిరోప్రాక్టిక్ ద్వారా అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని జరుపుకుంటామని డాక్టర్ వికాస్ టాండన్ వివరించారు. ఇది 2008లో ప్రారంభమైంది. వెన్నెముకకు సంబంధించిన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశం. గంటల తరబడి కూర్చొని పనిచేయడం, చెడు భంగిమ, బలహీనమైన జీవనశైలి, గాయం వెన్నెముకలో నొప్పికి కారణమవుతుందని డాక్టర్ వికాస్ వివరిస్తున్నారు. ఈ నొప్పి ప్రారంభంలో స్వల్పంగా ఉంటుంది. తరువాత క్రమంగా పెరుగుతుంది. కానీ దానిని విస్మరించకూడదు. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే మంచి భంగిమలో కూర్చోవాలి. లేవడం, కూర్చోవడం, నడిచే విధానం సరిగ్గా ఉండాలి. సరిగ్గా కూర్చోవడం మన మెదడుపై అనేక విధాలుగా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది వెన్నెముక సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. నిటారుగా కూర్చోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. నిటారుగా కూర్చుంటే శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జీవనశైలిని చక్కగా ఉంచుకోవాలి. ప్రతిరోజూ యోగా చేయాలి. పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో కాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే వాటిని చేర్చుకోవాలి.

# గర్భిణీలు స్మోకింగ్ చేస్తే.. అతి ప్రమాదకరం

పొగతాగడం ఆరోగ్యానికి ఎంతో హానికరమని అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు స్మోకింగ్ ప్రధాన కారణం. అందుకే ఈ అలవాటును మానుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలు మొదలు ఎముకలు, మెదడు ఆరోగ్యంపై కూడా స్మోకింగ్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే గర్భిణీలు ఒకవేళ స్మోకింగ్ చేస్తే మరింత ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ఇందుకు సంబంధించి తాజాగా చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మోకింగ్ వల్ల గర్భిణులకు తీవ్ర అనర్థాలు తప్పవని అంటున్నారు. సిగరెట్ పొగలో ఏకంగా నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి.



సాధారణంగా స్మోకింగ్ చేసే వారిలో ఈ రసాయనాలు రక్తంలో కలిసిపోతాయి. దీంతో ఈ రసాయనాలు ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. ఇది శిశువు ఎగుదలకు, మానసిక అభివృద్ధికి తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయని అధ్యయనంలో తేలింది. అంతేకాకుండా స్మోకింగ్ చేయడం వల్ల గర్భిణీ హృదయ స్పందనల రేటుపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో డెలివరీ సమయంలో తల్లి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

అయితే గర్భం దాల్చకముందు సిగరెట్ అలవాటు ఉండి. గర్భం దాల్చిన తర్వాత మానేసినా ఈ సమస్య వచ్చే అవకాశం 27 శాతం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో కూడా స్మోకింగ్ చేస్తే ఈ ముప్పు 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వేలో తేలింది. గర్భిణీలు స్మోకింగ్ చేస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కచ్చితంగా నేరుగా ప్రమాదం పడుతుందని, తల్లి కావాలనుకునే వారు కనీసం 6 నెలల ముందు నుంచి ఈ అలవాటును మానేయడం ఉత్తమం అని చెబుతున్నారు.

# ఆ యుద్ధం వల్లే.. షూటింగ్‌లో భారత్‌కు పతకాలు తగ్గాయా?

జపాన్ వేదికగా ఆసియా క్రీడలు 2026 ఎడిషన్ జరిగింది. ఇందులో ఆతిథ్య దేశానికి తప్ప మిగతా అన్నింటికీ పతకాలు తగ్గాయి. అగ్ర స్థానంలోని చైనాకూ తప్పలేదు. ఇక భారత్‌కు గతంతో పోలిస్తే ఏకంగా 22 పతకాలు తగ్గాయి. అందులో షూటింగ్‌లో అనుకున్నంత మేరకు మెడల్స్ రాలేదు. ఓ యుద్ధం కారణంగానే భారత్‌కు పతకాలు తగ్గాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



గత ఆసియా క్రీడలు (Asian Games) చైనాలో జరిగాయి. అప్పుడు భారత్‌కు షూటింగ్‌లో 22 పతకాలు వచ్చాయి. ఇందులో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 6 కాంస్యాలు ఉన్నాయి. కానీ, ఈసారి ఆ సంఖ్య 15కి పడిపోయింది. మూడు స్వర్ణాలు, 8 రజతాలు, 4 కాంస్యాలకే పరిమితమైంది. కానీ, భారత షూటర్లను మందుగుండు సామగ్రి ఇబ్బంది పెట్టడంతో అనుకున్నంత మేర ప్రదర్శన ఇవ్వలేక ఇబ్బంది పడ్డారు. మను బాకర్, రైజాన్ ధిల్లాన్, అనంత్ జీత్ సింగ్, ఈషా సింగ్ వంటివారిపై భారీ అంచనాలే పెట్టుకున్నా.. పతకాలు మాత్రం దక్కలేదు.

**ఉక్రెయిన్ - రష్యా వార్ వల్ల..**

మంచి గన్, నాణ్యమైన బుల్లెట్లు వాడినప్పుడు ప్రొఫెషనల్ షూటర్‌కు (indian Shooters) ఏ షాట్ ఎలా వెళ్తుందో కచ్చితంగా తెలుస్తుంది. మందుగుండు సామగ్రి సరిగా లేకపోతే ఎంత ఏకాగ్రతతో షూట్ చేసినా ఫలితం అనుకూలంగా రాదు. ఈసారి ఆసియా క్రీడల్లో భారత్ మహిళా షూటర్ ఆషి చౌక్సీకి ఇలాంటి అనుభవమే ఎదురైంది. 50 మీ . రైఫిల్ 3 పొజిషన్స్ కోసం వినియోగించిన బుల్లెట్లు (మందుగుండు సామగ్రి) సరిగా లేవని అనిపించినా.. దాంతోనే పోరాడాల్సి వచ్చింది. స్టాక్ అందుబాటులో లేదని కోచ్ చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ పడింది. చివరికి 23వ స్థానంతో ఫైనల్‌కూ అర్హత సాధించలేదు. ఇలాంటి పెద్ద వేదికల్లో ఒక్క మి.మీ తేడా వచ్చినా పతకంపై ప్రభావం చూపిస్తుంది. ఉక్రెయిన్ రష్యా (RussiaUkraine war) యుద్ధం వల్ల బుల్లెట్ల కొరత ఏర్పడిందనేది పలువురి వాదన. ఇప్పుడు ఆసియా క్రీడల్లో వాడిన సామగ్రి కూడా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మిగిలిపోయింది కావడం గమనార్హం. మ్యాచ్ గ్రేడ్ .22 మందుగుండు సామగ్రిని భారత షూటర్లు ప్రాక్టీస్ కోసం వినియోగిస్తారు. కానీ, అంతర్జాతీయ కారణాలతో సరఫరాలో జాప్యం జరిగింది. దీంతో మన షూటర్లు రెగ్యులర్ సాధనకు తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి.

**అదే తేడా..**

సాధారణంగా పౌర, రక్షణ కోసం వినియోగించే మందుగుండు (ammunition) సామగ్రి ఐదేళ్లపాటు నిల్వ ఉంటుంది. కానీ, పోటీల కోసం వాడే బుల్లెట్ సామగ్రికి మాత్రం అలాంటి పరిస్థితి ఉండదు. తేమ, ఉష్ణోగ్రత వంటి కారణాల వల్ల బుల్లెట్ పనితీరులో మార్పు వస్తుంది. భారత మాజీ షూటర్లు సుమా షిరూర్, విజయ్ కుమార్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మందుగుండు సామగ్రిని భద్రపరిచే విధానం కూడా కీలకమైందని పేర్కొన్నారు.

# వైభవంగా ముగింపు వేడుకలు.. పతాకధారిగా నీరూ ధండా

రెండు వారాల పాటు క్రీడా ప్రియులను అలరించిన ఆసియా గేమ్స్ ఆదివారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో జపాన్‌లో నగోయా సిటీ మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ముగింపు వేడుకలు జరిగాయి. అనంతరం "ఒకే ఆసియా" అనే సందేశాన్ని ముందుకు తీసుకు వెళ్తూ, ఐచినగోయా 2026 నుంచి ఖతార్‌లో జరగబోయే తదుపరి క్రీడల కోసం ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (OCA) పతాకాన్ని అధికారికంగా దోహ్ 2030కి అప్పగించారు. ఈసారి క్రీడల్లో 85 పతకాలు సాధించిన భారత్ ఖాతాలో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలున్నాయి. 2023 ఆసియా గేమ్స్‌లో 106 పతకాలు సాధించి సెంచరీ మార్క్‌ను దాటిన భారత్ జపాన్‌లో మాత్రం ఆ ఫీట్‌కు 15 పతకాల దూరంలోనే ఆగిపోయింది. అయితే పతకాల పట్టికలో మాత్రం తమ నాలుగో స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇక భారత్ తరఫున పతాకధారిగా నీరూ ధండా వ్యవహరించింది. ఆసియా గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో మూడు పతకాలు సాధించిన నీరు ధండాకు భారత ఒలింపిక్ అసోసియేషన్ అరుదైన గౌరవాన్ని అందించింది.

తన పోటీలు ముగిసిన తర్వాత భారతదేశానికి చేరుకున్న నీరూ ధండా ముగింపు వేడుకల్లో పతకాధారిగా భారత బృందాన్ని ముందుండి నడిపించేందుకు శనివారమే తిరిగి జపాన్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలో ముగింపు వేడుకల్లో నీరూ ధండా భారత త్రివర్ణ పతకాన్ని చేతబూని భారత బృందాన్ని నడిపించారు. ఇక ఆసియా క్రీడల చరిత్రలో వ్యక్తిగత ట్రాప్ షూటింగ్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా నీరూ ధండా సరికొత్త రికార్డు సృష్టించింది. ఈసారి పోటీల్లో నీరూ రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించింది. మహిళల వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన నీరూ ధండా ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ (కైనన్ చెనాయ్‌తో కలిసి) స్వర్ణం గెలిచింది. ఇక మహిళల టీమ్ ట్రాప్ (మనీషా కీర్, ఆషిమా అహ్లావత్‌లతో కలిసి) రజత పతకం సాధించింది. అయితే ఆసియా గేమ్స్ ప్రారంభానికి కొద్దిరోజుల ముందు ఆమె తీవ్రమైన వైరల్ జ్వరంతో బాధపడి, ఆసుపత్రిలో చేరింది. అయితే జ్వరం నుంచి కోలుకున్నప్పటికీ, నీరసంతో బాధపడుతూనే జపాన్‌కు వచ్చిన నీరూ ధండా మూడు పతకాలతో సత్తా చాటి దేశానికి గర్వకారణంగా నిలిచింది.



## ధోని మాటలు స్ఫూర్తి నింపాయి: షై హోప్

**భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో విండీస్ కోల్పోయింది. అయితే, చివరి-మ్యాచ్‌లో విండీస్ ఆ సారథి షై హోప్ అజేయ సెంచరీతో గెలి-పించాడు. హోప్ 143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 162 పరుగులు చేశాడు. అతడికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా తనకు టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని మాటలు స్ఫూర్తిగా నిలిచాయని గుర్తు చేసుకున్నాడు.**

**''ఎంఎస్ ధోని అద్భుతమైన వ్యక్తి. అతడితో నేను గతంలో మాట్లాడా. ఆ సందర్భంగా చెప్పిన మాటలు నాకు ఇప్ప-టికీ గుర్తున్నాయి. ఏదైనా లక్ష్య సాధనలో మనం అనుకున్న దానికంటే ఎప్పుడూ ఎక్కువ సమయం ఉంటుందని అన్నారు. ఈ మ్యాచ్‌లో కేవలం తుది ఫలి-తంపైనే ఎక్కువగా దృష్టి పెట్ట-కుండా చివరి వరకూ మ్యాచ్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించా. లక్ష్యం గురించి మరీ ఎక్కు-వగా ఆందోళన పడకుండా.. బౌండరీలను సాధించడం ఎలా అనేది ఫోకస్ చేశా'' అని హోప్ తెలిపాడు.**

**దానిపై అవగాహన ఉంది**

**''భారత జట్టు అప్పటికే కొన్ని ఓవర్లు వెనకబడి ఉందని నాకు తెలుసు. ఆఖర్లో ఎక్కువ మంది ఫీల్డర్లు బయట ఉండరని తెలుసు. సర్కిల్‌లో ఐదుగురు ఉండాలి. ఇలాంటి స్కోరును డిఫెండ్ చేయడం కష్టమని తెలుసు. వాటన్నింటిని పరిగ-ణనలోకి తీసుకొని బ్యాటింగ్ చేశా. అదృష్టవశాత్తూ మాకు మంచే జరిగింది.'' అని వెల్లడిం-చాడు.**

# శ్రమపడేలా చేశారు.. వెస్టిండీస్‌పై గంభీర్ ప్రశంసలు



వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌ను 21తో కైవసం చేసుకున్న తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. భారత జట్టును చివరి వరకు శ్రమించేలా చేసిన వెస్టిండీస్ ఆటతీరును ప్రశంసించాడు. సిరీస్ గెలవడానికి తమ ఆటగాళ్లు చేసిన కష్టాన్ని కూడా కొనియాడాడు.

తొలి వన్డేలో విరాట్ అద్భుత శతకంతో భారత్ సునాయాస విజయం సాధించింది. అయితే ఆ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో వెస్టిండీస్ గట్టి పోటీ ఇచ్చింది. రెండో వన్డేలో 400కు పైగా పరుగులు చేసిన విండీస్.. చివరి మ్యాచ్‌లో ఏకంగా 352 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. సిరీస్ విజయంపై గంభీర్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. "నమ్మకం, కష్టంతో సాధించిన సిరీస్ విజయం ఇది. మా ఆటగాళ్ల పట్ల గర్వంగా ఉంది. ఈ సిరీస్‌ను మాకు సులభంగా దక్కకుండా చేసిన వెస్టిండీస్‌కు గౌరవం" అంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. రెండో వన్డేలో 405 పరుగులుతొలి వన్డేలో భారత బౌలర్లపై ఆధిపత్యం చెలాయించలేకపోయిన వెస్టిండీస్.. రెండో మ్యాచ్‌లో మాత్రం చెలరేగిపోయింది. భారత బౌలింగ్‌ను చితక్కొట్టిన విండీస్ బ్యాటర్లు ఏకంగా 405 పరుగులు చేశారు. భారత్ ఆ మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ.. వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రదర్శన టీమిండియాకు హెచ్చరికగా నిలిచింది. ఆ తర్వాతి మ్యాచ్‌లో విండీస్ మరోసారి భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంది. హోప్ అద్భుత ఛేజింగ్మూడో వన్డేలో భారత్ కేఎల్ రాహుల్ శతకంతో 351/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో భారత్ సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేస్తుందని అంతా భావించారు.అయితే షాయ్ హోప్ అద్భుత బ్యాటింగ్‌తో భారత అంచనాలను తారుమారు చేశాడు. భారత బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ విండీస్‌ను లక్ష్యం దిశగా నడిపించాడు. చివరికి 352 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్.. సిరీస్‌ను 12తో ముగించింది.

# కెప్టెన్‌గా రుతురాజ్.. మ్యాచ్ టైమింగ్స్

ఆస్ట్రేలియాఎ జట్టు భారత్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇరుజట్ల మధ్య రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్ ముగిసిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 6, 9, 11 మధ్య మూడు మ్యాచ్‌ల అనధికారిక వన్డే సిరీస్ జరగనుంది. ఈ నేపథ్యంలో మ్యాచ్‌లకు సంబంధించి టైమింగ్స్, లైవ్ స్ట్రీమింగ్ వివరాలను బీసీసీఐ వెల్లడించింది.

తొలి వన్డే డే నైట్‌లో జరగనుండగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు డే ఫార్మాట్‌లో జరగనున్నాయి. అక్టోబర్ 6న జరగనున్న తొలి వన్డే మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానుండగా, మిగతా రెండు వన్డేలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి. మ్యాచ్‌లన్నీ పాండిచ్చేరి వేదికగా జరగనుండగా, హాట్ స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ కానుంది.

మ్యాచ్‌ల టైమింగ్స్ వివరాలు..□అక్టోబర్ 6న తొలి అనధికారిక వన్డే మధ్యాహ్నం 2 గంటల నుంచి□అక్టోబర్ 9న రెండో అనధికారిక వన్డే ఉదయం 9 గంటల నుంచి□అక్టోబర్ 11న మూడో అనధికారిక వన్డే ఉదయం 9 గంటల నుంచి(మ్యాచ్‌లన్నీ పాండిచ్చేరి వేదికగా.. జియో హాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్)



కెప్టెన్‌గా రుతురాజ్‌కాగా ఇండియాఎ జట్టును రుతురాజ్ గైక్వాడ్ నడిపించనున్నాడు. పడిక్కల్, సాయి సుదర్శన్, ప్రియాన్ష్ ఆర్య, రజత్ పటీదార్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ వంటి స్టార్ ఆటగాళ్లు జట్టులో ఉండడంతో సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌లో ఆడడం అనుమానమే.

ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో కోలుకుంటున్న పాండ్యా తాజాగా మళ్లీ గాయపడినట్లు తెలుస్తోంది. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అతడి కుడి మోకాలు కింద భాగంలో గాయమైందట. స్కానింగ్ రిపోర్టుల ఆధారంగా అతడికి కనీసం మూడు వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో ఆస్ట్రేలియాఎతో జరగనున్న వన్డే సిరీస్ నుంచి హార్దిక్‌ను తప్పించి అతడి స్థానంలో ముంబై ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్గెకు చోటు దక్కింది.

ఆసీస్‌తో సిరీస్‌కు భారతఎ జట్టురుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, కుమార్ కుషాగ్రా, నిశాంత్ సింధు, విప్రజ్ నిగమ్, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, నమన్ ధీర్, సూర్యాన్ష్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, గ్రూర్ సింగ్, గుర్జప్‌నీత్ సింగ్, యశ్ ఠాకూర్



# 15 ఏళ్ల కుర్రాడిని హేళన చేస్తావా?.. పాక్ ఆల్‌రౌండర్‌పై కమ్రాన్ అక్మల్ ఫైర్

ఆసియా క్రీడలు 2026 క్రికెట్ టోర్నీ ఫైనల్లో టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని పాక్ ఆల్‌రౌండర్ సైమ్ అయూబ్ హేళన చేసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో సూర్యవంశీని అవుట్ చేసిన తర్వాత సైమ్ అయూబ్ 'బేబీసిట్టింగ్' తరహా సెలబ్రేషన్ చేసుకోవడం తీవ్ర వివాదాస్పదమైంది.

దీంతో అయూబ్‌పై సర్వాత్ర విమర్శల వర్షం కురుస్తోంది. భారత అభిమానులతో పాటు పలువురు పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు సైతం అయూబ్ ప్రవర్తనను తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్‌బ్యాటర్ కమ్రాన్ అక్మల్, సైమ్ అయూబ్ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేవలం సోషల్ మీడియా పబ్లిసిటీ కోసమే అయూబ్ ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు

"ప్రస్తుతం మన జట్టు ప్రదర్శన అంత గొప్పగా ఏమీ లేదు. కానీ సోషల్ మీడియాలో హైలైట్ అవ్వడం కోసం గత కొంతకాలంగా ఇలాంటి చర్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇది అంతర్జాతీయ క్రికెట్ అనే విషయాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ గుర్తించాలి.

వైభవ్ సూర్యవంశీకి 13, 14 లేదా 15 ఏళ్లు కావచ్చు.. కానీ అతడు తన ప్రతిభతో సీనియర్ స్థాయిలో అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాడు. సైమ్ అయూబ్ ఇంకా చిన్న పిల్లాడు కాదు, ముందు తన సొంత ప్రదర్శనపై దృష్టి పెడితే మంచిది" అని అక్మల్ గేమ్ ప్లాన్' యూట్యూబ్ షోలో పేర్కొన్నాడు.

కాగా ఫైనల్ మ్యాచ్‌లో అయూబ్ దారుణంగా విఫలమయ్యాడు. వైభవ్ సూర్యవంశీ వికెట్ తీసినప్పటికీ అయూబ్ తన నాలుగు ఓవర్లలో 47 పరుగులు సమర్పించుకున్నాడు. ఫీల్డింగ్‌లో రెండు క్యాచ్‌లను జారవిడిచాడు. అదేవిధంగా బ్యాటింగ్‌లో 22 బంతులు ఎదుర్కొని 29 పరుగులు ఔటయ్యాడు.



# టీమిండియాకు భారీ షాక్!

ఆస్ట్రేలియాఎతో మూడు వన్డేల అనధికారిక మూడు వన్డేల సిరీస్‌కు ముందు భారత్‌ఎ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం కారణంగా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 నుంచి పోటీ క్రికెట్ దూరంగా ఉన్న హార్దిక్.. ఆసీస్‌ఎ సిరీస్‌తో మైదానంలో అడుగు పెడతాడని అంతా భావించారు. కానీ బెంగుళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటున్న హార్దిక్ పాండ్యా తాజాగా మరో కొత్త గాయం బారిన పడ్డాడు. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అతడి కుడి కాలి మోకాలు కింద భాగంలో గాయమైంది.

స్కానింగ్ రిపోర్టుల ఆధారంగా అతను కనీసం మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో అక్టోబర్ 6వ తేదీ నుంచి ఆస్ట్రేలియాఏ జట్టుతో జరిగే వన్డే సిరీస్ నుంచి అతడిని సెలక్టర్లు తప్పించారు. దీంతో పాండ్యా స్థానంలో ముంబై ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్గేకు చోటు దక్కింది. 23 ఏళ్ల ఈ యువ ఆల్‌రౌండర్ ఇప్పటికే సీనియర్ జట్టు తరపున అరంగేట్రం కూడా చేశాడు. ఇప్పుడు మరోసారి వైట్‌బాల్ క్రికెట్‌లో తన సత్తా చాటేందుకు అతడికి అవకాశం లభించింది. షెడ్గే కూడా గాయం నుంచి కోలుకుని వస్తున్నాడు. హార్దిక్ విషయానికి వస్తే.. ఇప్పటికే విండీస్‌తో టీ20లకు కూడా దూరమైన ఈ బరోడా ఆల్‌రౌండర్ న్యూజిలాండ్ పర్యటనకు కూడా వెళ్లేది అనుమానమే,.

# శుబ్‌మన్ గిల్ అరుదైన రికార్డు..

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 21 తేడాతో టీమిండియా ముగించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన మూడో వన్డేలో గెలిచి సిరీస్ క్లీన్ స్వీప్ చేయాలని భావించిన భారత్‌కు విండీస్ షాకిచ్చింది. 352 పరుగుల భారీ లక్ష్యాన్ని చేధించి క్లీన్ స్వీప్ నుంచి కరేబియన్ జట్టు తప్పించుకుంది. చివరి మ్యాచ్‌లో టీమిండియా ఓడిపోయినప్పటికీ, 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు మాత్రం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కే దక్కింది.

గిల్ మూడో వన్డేలో విఫలమైనప్పటికి తొలి రెండు మ్యాచ్‌లలో వరుసగా సెంచరీ, డబుల్ సెంచరీలతో చెలరేగాడు. ఈ సిరీస్‌లోని 3 ఇన్నింగ్స్‌లలో కలిపి మొత్తం 334 పరుగులు సాధించాడు. దీంతో గిల్ ఒక అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక సార్లు (7 సార్లు) 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్న మూడో ఆటగాడిగా దిగ్గజాలు యువరాజ్ సింగ్, ఎంఎస్ ధోనీ, సౌరవ్ గంగూలీ సరసన నిలిచాడు.

యువీ, ధోనీ, గంగూలీలు కూడా ఏడేసి సార్లు ఈ అవార్డును గెలుచుకోగా, గిల్ కేవలం 70 వన్డేల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. త్వరలో న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో గిల్ రాణిస్తే, వీరి రికార్డును అధిగమించి రెండో స్థానంలోకి వెళ్లే అవకాశముంది.



రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

## సినిమా చూసిన వాళ్లంతా కన్నీళ్లతో బయటకొస్తున్నారు!

'యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులూ తప్పక చూడాల్సిన సినిమా 'తెల్ల కాగితం'' అన్నారు దర్శకుడు రమేశ్ బండ్రెడ్డి. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటించిన సంగతి తెలిసిందే. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. "స్వచ్ఛమైన మనసులన్నీ కలిసి ఓ సినిమా చేస్తే అదెలా ఉంటుందన్నదే ఈ చిత్రం. పిల్లలతో పాటు పెద్దవాళ్లు, కుటుంబ ప్రేక్షకులు థియేటర్‌కి వెళ్లి మా చిత్రం చూడటం ఆనందాన్నిస్తోంది" అన్నారు. "ఈ సినిమాకి అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సినిమాలో రోషన్ ఏడుస్తుంటే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ చిత్రాన్ని నమ్మి కొన్న ఈటీవీ విన్ యాజమాన్యానికి శుభాకాంక్షలు" అన్నారు నిర్మాత బెక్కెం వేణుగోపాల్. ఈ కార్యక్రమంలో నక్షత్ర, శ్రావ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



రోషన్, నక్షత్ర

## ఆ పాత్ర అయితే వెంటనే ఒప్పేసుకుంటా!

"ఎంచుకునే పాత్రలతోనే ఎప్పటికీ గుర్తుండిపోవాలని, అలాగే ఏదైనా మంచి పనిచేసేలా ఇతరులకు స్ఫూర్తినివ్వాలని నేను కోరుకుంటున్నా" అని అంటున్నారు అందాల తార కృతి శెట్టి. జయాపజయాలతో సంబంధం లేకుండా ఎదురైన అవకాశంతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోన్న ఈమె.. ఈ ఏడాది ప్రారంభంలోనే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' లాంటి చిత్రాలతో తెరపై మెరిశారు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి మాట్లాడుతూ.. "నా వృత్తిని నేను ఎంతగానో ప్రేమిస్తున్నా. అందుకే మరింత బలమైన నటిగా ఎదగడానికి చేయగలిగినదంతా చేయాలనుకుంటున్నా. నేను నటించే సినిమాలతో ప్రేక్షకుల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకురావడమే నా లక్ష్యం. భావోద్వేగభరితమైన పాత్రలు పోషించడంలో నాకు మంచి పట్టు ఉంది. కానీ నా కలల పాత్ర మాత్రం పూర్తిగా భిన్నమైంది. ఒక యువరాణి లేదా యోధురాలిగా నటించాలనేది నా కోరిక. దీని కోసం ముందే ఓ ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నా. ఆ పాత్రతో ఎవరైనా నా ఇంటి తలుపు తట్టి పిలుస్తారేమో అని ఎదురుచూస్తున్నా. ఒక వేళ అలాంటి అవకాశం వస్తే.. రెండు వారాల్లోనే షూటింగ్‌లో కూడా పాల్గొంటా"అని చెప్పారు.



## సుకుమార్ దగ్గరే పని చేయాలని మూడేళ్లు తిరిగా..



టాలీవుడ్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, ఇండస్ట్రీలోకి రాకముందు పడిన కష్టాల గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకున్న ఆసక్తికర విషయాలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ డైరెక్టర్ సుకుమార్ కోసం ఆయన పడిన తపన అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. తాను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే శేషు అనే సర్ ద్వారా దర్శకుడు సుకుమార్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఆ పరిచయంతోనే ఆయన దగ్గర అవకాశం కోసం ప్రయత్నించినప్పటికీ మొదట్లో కుదరలేదన్నారు. ఆ తర్వాత 'ఆర్య 2' సినిమా సమయానికి అన్నపూర్ణ స్టూడియోస్‌లో సుకుమార్‌ని మరోసారి కలిశానని, అప్పుడే ఆయనతోనే పనిచేయాలని గట్టిగా డిసైడ్ అయినట్లు పేర్కొన్నారు.

ఆ నిర్ణయంతోనే ఏకంగా మూడేళ్ల పాటు సుకుమార్ ఇంటి చుట్టూ తిరిగినట్లు శ్రీకాంత్ తెలిపారు. అలా రోజులు తిరిగేసరికి ఒకరోజు విసిగిపోయిన సుకుమార్.. తాను ఎవరని, అసలు ఏం కావాలని కోపంగా అడిగారని చెప్పారు. అప్పుడు తాను అసిస్టెంట్ డైరెక్టర్ కావాలనుకుంటున్నట్లు తెలిపానని, వెంటనే ఒక షార్ట్ ఫిలిం తీసి తీసుకురమ్మని సుకుమార్ సూచించారన్నారు. ఆ తర్వాత తను ఒక షార్ట్ ఫిలిం తీసి చూపించడంతో సుకుమార్ తనను టీమ్‌లోకి తీసుకున్నారని తెలిపారు. అయితే ఆయన దగ్గర కేవలం రెండు సినిమాలకు మాత్రమే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని శ్రీకాంత్ చెప్పారు. సుకుమార్ దగ్గర చేరడానికి ముందే దేశంలోనే నెంబర్ వన్ దర్శకుడి దగ్గర నుంచి తనకు ఆఫర్ వచ్చినప్పటికీ, సుకుమార్ మీదున్న ఇష్టంతో ఆ అవకాశాన్ని వదులుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఇది డిజిటల్ లైంగిక దాడితో సమానం..



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రంలోని సూపర్ హిట్ సాంగ్ 'చుట్టమల్లె'కు సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియో ప్రస్తుతం నెట్టింట తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వీడియోలో జాన్వీ కపూర్‌ను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తుండటంపై సినీ సెలబ్రిటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఘటనపై ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ వార్నింగ్ ఇవ్వగా, తాజాగా రౌడీ హీరో విజయ్ దేవరకొండ ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. మనం పూర్తిగా నీచ స్థాయికి దిగజారామని, దీనికి బాధ్యులైన వారిని అసలు వదిలిపెట్టకూడదని అన్నారు. వీరు అత్యంత కఠినమైన చట్టపరమైన శిక్షలను ఎదుర్కొని, భవిష్యత్తులో ఇతరులకు ఇదొక గుణపాఠంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజంలో మనుషుల దయ, ఒకరినొకరు గౌరవించుకునే గుణం పోయిందని.. కించపరచుకోవడంలో ఆనందం పొందే సమాజంలో మనం జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు ఎలా పోతాయని, జీవనోపాధి ఎలా దెబ్బతింటుందని భయపడుతుంటే.. కొందరు మూర్ఖులు మాత్రం ఇదే టెక్నాలజీని ఇలాంటి నీచమైన పనులకు వాడుతున్నారని మండిపడ్డారు. ఇది కేవలం వీడియో మార్ఫింగ్ కాదని, డిజిటల్ రూపంలో జరిగిన లైంగిక దాడి అని విజయ్ అన్నారు. ఇలాంటి చర్యలను చట్టం అత్యంత తీవ్రంగా పరిగణించాలని, దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## తప్పు చేసినవారిని వదిలేసి బాధితులనే ఎందుకు విమర్శిస్తారు?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం ఇచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. తల్లి కాబోతుండటంతో గ్యాప్ తీసుకున్నారు. అయితే సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా ఆమె ఎప్పుడూ అభిమానులకు టచ్‌లో ఉంటుంటారు. ముఖ్యంగా సమాజంలో జరిగే విషయాలపై, మహిళల మీద జరిగే తప్పులపై ఆమె స్పందిస్తూ పెడుతూ ఉండే పోస్టులు ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. తాజాగా సమంత సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ పెద్ద చర్చకు దారితీసింది. సమాజంలో కొందరు ఆలోచించే తీరును, మనస్తత్వాన్ని ఆమె ఈ పోస్ట్ ద్వారా చాలా గట్టిగా ప్రశ్నించారు. మనం ఇప్పటికైనా ఆలోచనలు మార్చుకోవాలని సమంత కోరారు.

సమాజంలో లైంగిక కార్మికులను తప్పుపడతారు కానీ వారి దగ్గరకు వెళ్లే క్లయింట్లను ఎవరూ ఏమీ అనరని సమంత పేర్కొన్నారు. ఒంటరి తల్లులను విమర్శిస్తారు కానీ పిల్లల బాధ్యత తీసుకోని తండ్రులను ఎవరూ ప్రశ్నించరని ఆమె తెలిపారు. అలాగే అత్యాచారం జరిగినప్పుడు బాధితురాలినే తప్పుపడతారు కానీ తప్పు చేసిన వారిని కాదని, తప్పును కప్పిపుచ్చే వారిని వదిలేసి ఆ తప్పు గురించి ధైర్యంగా బయటపెట్టి మాట్లాడేవారినే విమర్శించే లోకంలో మనం బతుకుతున్నామని ఆమె తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. సమాజంలో ఉన్న ఈ చెడ్డ పద్ధతులను, తప్పుడు ఆలోచనలను సమంత తన మాటలతో నిలదీశారు. ఇప్పుడు ఈ పోస్ట్ నెట్టింట విపరీతంగా షేర్ అవుతోంది. ఇలాంటి ముఖ్యమైన విషయంపై సమంత ధైర్యంగా స్పందించడం పట్ల ఆమె అభిమానులు, నెటిజన్లు ఆమెకు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు.



## సెన్సార్ పూర్తి చేసుకున్న 'కామ్రేడ్ కళ్యాణ్'..




టాలీవుడ్ టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద కొన్నిసార్లు అదృష్టం = కలిసి రావడం లేదు. అయినప్పటికీ ఏమాత్రం నిరాశ చెందకుండా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ, ముఖ్యంగా కామెడీ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూ ఫుల్ జోరుమీదున్నారు. ఇప్పుడు అదే జోరుతో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే రాధిక శరత్ కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలలో కనిపించబోతున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్, కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్నాటీ, సీతా కర్నాటీ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను అక్టోబర్ 9న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో తాజాగా, ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్నట్లు హీరో శ్రీవిష్ణు అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి 'U/A' సర్టిఫికెట్ లభించినట్లు తెలిపారు. అంతేకాకుండా, సినిమాలో ఎలాంటి తుపాకుల కాల్పులు ఉండవని, కేవలం నవ్వుల సందడి మాత్రమే ఉంటుందని ఆయన ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేశారు. వైవిధ్యమైన కామెడీతో రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

## శారీరకంగా సంతృప్తినిచ్చే బంధా.. ఏర్పరుచుకుంటున్నారు

బాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకురాలు, ఆమిర్ ఖాన్ మాజీ భార్య కిరణ్ రావు నేటి తరం యువత రిలేషన్‌షిప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నేటి యువత ఆలోచనా విధానం, బంధాల పట్ల వారిస్తున్న అభిప్రాయాలపై ఆమె ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. తన కాలంతో పోలిస్తే ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పు వచ్చిందని కిరణ్ రావు చెప్పారు. నేటి యువతలో ఒక రకమైన స్వేచ్ఛ, ఎలాంటి సంకోచం లేని భావన స్పష్టంగా కనిపిస్తోందని ఆమె తెలిపారు. కాలం మారింది, దానికి తగ్గట్టుగానే మనుషులు తమ భావాలను వ్యక్తపరిచే పద్ధతులు కూడా పూర్తిగా మారిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఒకరిపై ఒకరు ఇష్టం పెంచుకున్న ఇద్దరు యువతీయువకులు, ఎలాంటి బంధనాలు లేదా కట్టుబాట్లు లేనప్పుడు వారి ప్రయాణం ఎలా ఉంటుంది? వారు తీసుకునే నిర్ణయాల వల్ల ఎలాంటి ఊహించని పరిణామాలు ఎదురవుతాయి? అనే విషయాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. తాను యువతిగా ఉన్న రోజుల్లో ఒక వ్యక్తితో కేవలం ఒకే రకమైన కట్టుబాట్లతో కూడిన సంబంధం మాత్రమే ఉండాలనే నిబంధన ఉండేదని గుర్తుచేసుకున్నారు. అది శారీరక సంబంధం కావచ్చు, లేదా పెద్దలు కుదిర్చిన పెళ్లి తర్వాత ఏర్పడే బంధం కావచ్చు అని వివరించారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని కిరణ్ రావు స్పష్టం చేశారు. పెళ్లి అనే బంధంతో సంబంధం లేకుండానే చాలామంది గాఢమైన, భావోద్వేగపరంగా సంతృప్తినిచ్చే రిలేషన్స్‌లో ఉంటున్నారని చెప్పారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com